RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 336 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 డిసెంబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

## నేవీలో హెలికాప్టర్ తొలి మహిళా పైలట్‌గా అనామిక

విశాఖపట్నం : భారత నౌకాదళంలో హెలికాప్టర్ తొలి మహిళా పైలట్ లెఫ్టినెంట్ అనామిక రాజీవ్ విశాఖపట్నంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి నేవీ వైమానిక స్థావరం ఐఎన్ఎస్ డేగలో ఆమె విధులు నిర్వహించనున్నారు. నేవీ హెలికాప్టర్లలో సీ కింగ్, ఏఎల్‌హెచ్ ధ్రువ్, చేతక్, ఎంహెచ్-60ఆర్ సీ హాక్స్‌కు ఆమె సారథ్యం వహిస్తారు. నాలుగేళ్ల క్రితం నిఘా విమానం డార్నియర్‌లో తొలి మహిళా పైలట్‌గా శుభాంగి స్వరూప్ బాధ్యతలు చేపట్టారు. ఈసారి హెలికాప్టర్లను నడిపే బాధ్యత మహిళలకు అప్పగించారు. అందులో అనామికకు మొదటి అవకాశం లభించింది. అనామిక రాజీవ్ స్వస్థలం కేరళలోని తిరువనంతపురం. ఆమె తమిళనాడులోని ఐఎన్ఎస్ రజాలీలో హెలికాప్టర్ శిక్షణ పొందారు.




# ఇండస్ట్రీ సమస్యల పరిష్కారానికి సహకరిస్తాం

## సినీ పెద్దలకు సీఎం రేవంత్ భరోసా

హైదరాబాద్: సినీ పరిశ్రమను ప్రోత్సహించడమే తమ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇండస్ట్రీ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం సహకారం అందిస్తుందని భరోసానిచ్చారు. సినీ ప్రముఖులతో సీఎం భేటీ గురువారం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధిలో సినీ పరిశ్రమ సామాజిక బాధ్యతతో ఉండాలని ముఖ్యమంత్రి సినీ పెద్దలకు సూచించారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో సుమారు 50 మంది సీఎంతో సమావేశమయ్యారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీజీపీ జితేందర్ తదితరులు హాజరయ్యారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట, అల్లు అర్జున్ అరెస్ట్ అనంతర పరిణామాల నేపథ్యంలో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. సమావేశం ప్రారంభంలో సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన వీడియోను సినీ ప్రముఖుల ఎదుట సీఎం ప్రదర్శించారు. అనంతరం పలువురు సినీ పెద్దలు తమ అభిప్రాయాలను ముఖ్యమంత్రితో పంచుకున్నారు. ప్రభుత్వం వైఖరిని సీఎం వారికి వివరించారు.

**బౌన్సర్లపై సీరియస్‌గా ఉంటాం: సీఎం...** "ప్రభుత్వం ఇండస్ట్రీతోనే ఉంది. శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. అభిమానుల్ని కంట్రోల్ చేసుకోవాల్సిన బాధ్యత సెలబ్రిటీలదే. తెలంగాణ అభివృద్ధిలో పరిశ్రమ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన, మహిళా భద్రతపై ప్రచారంలో సినీ ప్రముఖులు చొరవ చూపాలి. ఆలయ పర్యటకం, ఎకోటూరిజంను ప్రచారం చేయాలి. ఇన్వెస్ట్‌మెంట్ల విషయంలోనూ ఇండస్ట్రీ సహకరించాలి. ఇకపై బౌన్సర్ల విషయంలో సీరియస్‌గా ఉంటాం" అని ముఖ్యమంత్రి రేవంత్ తేల్చి చెప్పారు.

**'పుష్ప'కు పోలీసు గ్రౌండ్ ఇచ్చాం..** "సినీ పరిశ్రమ సమస్యలను ప్రముఖులు మా దృష్టికి తెచ్చారు. అనుమానాలు, అపోహలు, ఆలోచనలు పంచుకున్నారు. మా ప్రభుత్వం ఇండస్ట్రీకి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. సినీ పరిశ్రమను ప్రోత్సహించడమే మా ముఖ్య ఉద్దేశం. 8 సినిమాలకు మా ప్రభుత్వం స్పెషల్ జీవోలు ఇచ్చింది. పుష్ప సినిమాకు పోలీసు గ్రౌండ్ ఇచ్చాం. తెలుగు ఇండస్ట్రీకి ఒక బ్రాండ్ సృష్టించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఐటీ, ఫార్మాతో పాటు మాకు ఈ రంగం కూడా ముఖ్యమే. తెలంగాణలో అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి గద్దర్ అవార్డును తీసుకొచ్చాం. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్యవర్తిగా ఉండాలని దిల్ రాజును ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించాం. సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. పరిశ్రమ కూడా కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. హాలీవుడ్, బాలీవుడ్ హైదరాబాద్ వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో పెద్ద సదస్సులు నిర్వహించి ఇతర సినీ పరిశ్రమలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నాం. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి నైపుణ్యాలను పెంచి ఉద్యోగాలు కల్పిస్తున్నాం. ఇండస్ట్రీకి ఏం చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలే చేశాయి. ఆ వారసత్వాన్ని మేమూ కొనసాగిస్తాం. తెలుగు పరిశ్రమ తెలుగుకే పరిమితం కాకుండా అంతా కలిసి అభివృద్ధి చేద్దాం" అని సీఎం వివరించారు. సినీ పరిశ్రమ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వ సహకారం ఉంటుందని.. ఆ మేరకు సినీ ప్రముఖులకు భరోసా ఇచ్చినట్లు ఆ తర్వాత ముఖ్యమంత్రి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

**ప్రభుత్వం సహకరిస్తేనే..: నాగార్జున...** ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. "ప్రభుత్వం మూలధన పెట్టుబడులు కల్పిస్తేనే మన సినీ పరిశ్రమ ప్రపంచ స్థాయికి ఎదుగుతుంది. హైదరాబాద్ ప్రపంచ సినిమా రాజధాని కావాలనేదే మా కోరిక. యూనివర్సల్ లెవల్‌లో స్టూడియో సెటప్‌లు ఉండాలి" అని తెలిపారు. మర్రి చెన్నారెడ్డి, అక్కినేని వల్లే పరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చిందని దర్శకుడు త్రివిక్రమ్ చెప్పారు.

**సీఎంతో సమావేశంలో పలువురు ప్రముఖులు తెలిపిన అభిప్రాయాలు ఇలా..** "తెలంగాణలో అద్భుతమైన పర్యటన ప్రదేశాలున్నాయి. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను హైదరాబాద్‌లో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. అందరు సీఎంలూ పరిశ్రమను బాగానే చూసుకున్నారు. ఈ ప్రభుత్వం కూడా మాకు ప్రోత్సాహం అందిస్తోంది. దిల్‌రాజును ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించడం హర్షణీయం"

**- దర్శకుడు రాఘవేంద్రరావు**

"నేను చిన్నప్పటి నుంచి పరిశ్రమను చూస్తున్నా. హైదరాబాద్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాలి. చిన్న చిన్న విషయాలను పట్టించుకోవద్దు"

**- నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి**

"సంధ్య థియేటర్ ఘటన మమల్నీ ఎంతగానో బాధించింది. ఎన్నికల ఫలితాల మాదిరిగానే సినిమా రిలీజ్ ఫస్ట్‌డే ఉంటుంది. సినిమా రిలీజ్‌లో పోటీ వల్లే ప్రమోషన్ కీలకంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా సినిమాలు విడుదలవుతున్నందున విస్తృతంగా ప్రమోషన్లు చేస్తున్నాం"

**- మురళీ మోహన్**

"ప్రభుత్వంపై మాకు పూర్తి నమ్మకం ఉంది. ప్రభుత్వం సాయంతోనే ఆ రోజుల్లో సినీ పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చింది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ సహా అన్ని ఏజెన్సీలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా ఉండాలి. నగరాన్ని ఇంటర్నేషనల్ ఫిల్మ్ డెస్టినేషన్‌గా చేయాలనేది మా కల"

**- నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు**

# తెలంగాణ రైతులకు షాక్..!? - ఏడెకరాలకేనా... రైతు బంధు !!




హైదరాబాద్ : తెలంగాణ రైతులకు షాక్ ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఏడెకరాల వరకే రైతుబంధు లిమిట్ పెట్టే ఛాన్సులు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఐటీ చెల్లించే వారికి, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు రైతుబంధు కట్ అయ్యే ఛాన్స్ ఉందని సమాచారం. ఈ మేరకు రైతు భరోసా మార్గదర్శకాలు సిద్ధం చేసిందట తెలంగాణ ప్రభుత్వం. అంతేకాదు... పీఎం కిసాన్ తరహాలోనే కఠిన నిబంధనలు పెట్టే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. కుటుంబంలో ఎంతమంది పేరిట భూమి ఉన్నా అందరిదీ ఒకే లెక్కన కట్టి కుటుంబం యూనిట్ లాగా తీసుకొని గరిష్టంగా ఏడెకరాల వరకే రైతుబంధు పరిమితం చేసి అంతవరకే రైతు భరోసా ఇచ్చేందుకు సిద్ధమవుతోందట రేవంత్ రెడ్డి ప్రభుత్వం. అయితే.. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన అయితే రాలేదు.




దిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురై దిల్లీ ఎయిమ్స్‌లో చేరిన ఆయన చికిత్స పొందుతూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. దేశంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టిన వ్యక్తిగా నిలిచిన మన్మోహన్ సింగ్.. అక్టోబర్ 1991లో తొలిసారి రాజ్యసభలో అడుగుపెట్టారు. 1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పని చేసిన ఆయన.. ఆ తర్వాత 2004 నుంచి 2014 వరకు పదేళ్ల పాటు భారత ప్రధానిగా సేవలందించారు. దేశాన్ని సుదీర్ఘకాలంపాటు పాలించిన ప్రధానుల్లో ఒకరిగా నిలిచారు.

# పంచాయతీ ఎన్నికలపై ఫోకస్..!

## సంక్షేమ పథకాలే ఆయుధంగా కాంగ్రెస్ దూకుడు!!




హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగుతున్నది. లోకల్ బాడీస్ ఎన్నికల్లో ఏకపక్షంగా ఫలితాలను సాధించాలని ఈ మేరకు రకరకాల వ్యూహాలను అమలు చేస్తున్నది. ఈ ఎన్నికల్లో విజయం సాధించడం వల్ల రాజకీయంగా మరింత సుస్థిరతను సాధించవచ్చని అంచనా వేస్తున్నది. ఇప్పటికే అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు గట్టి దెబ్బ తగిలింది. ఓటు బ్యాంకు సైతం భారీగా పడిపోయింది. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఆ పార్టీని గట్టి దెబ్బతీయాలని కాంగ్రెస్ పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేస్తున్నది. ఇప్పటికే అమలవుతున్న సంక్షేమ పథకాలతో పాటు కొత్తగా మరికొన్నింటిని ఇంప్లిమెంట్ చేసేందుకు సిద్ధమైంది. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని ప్రయత్నిస్తున్నది.

**సంక్రాంతి తరువాత ఎన్నికలు..?...** గ్రామాల్లో సర్పంచుల కాల పరిమితి ముగిసి ఏడాది కావస్తున్నా.. ఇంకే ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతున్నది. ఈ క్రమంలో సంక్రాంతి తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. అందుకే.. దానిని టార్గెట్‌గా పెట్టుకొని.. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయాలని ప్లాన్ చేస్తున్నది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం డిసైడ్ అయినట్టు సమాచారం. దీనికోసం అవసరమైన చట్ట సవరణలను ఇప్పటికే అసెంబ్లీ సమావేశాల్లో పూర్తిచేశారు.

**పథకాలపై ప్రభుత్వం ఫోకస్...** ఎన్నికలకు ముందు పథకాలను అమలు చేయడం ద్వారా వీలైనంతా మైలేజీ పొంది ఎక్కువ స్థానాల్లో విజయం సాధించొచ్చని అధికార పార్టీ ఆలోచిస్తున్నది. అందులో భాగంగానే ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు నెలకు రూ.వెయ్యి, కొత్త రేషన్?కార్డుల ప్రక్రియ ప్రారంభం, పెండింగ్‌లో ఉన్న మాజీ సర్పంచ్‌ల బిల్లుల విడుదల వంటివి ప్లాన్ చేస్తున్నది. ఈ నెల 28న కాంగ్రెస్? పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వ్యవసాయ కూలీలకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఇచ్చే పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనున్నది. ఆరు నెలలకు సంబంధించిన మొత్తాన్ని (రూ.6వేలను) ఒకేసారి ఇవ్వనున్నది. దీనికోసం లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ చురుగ్గా సాగుతున్నది. ఇక.. ఆరు గ్యారంటీల్లో రైతు భరోసా ప్రధానమైంది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మందికి పైగా లబ్ధిదారులు ఉన్నారు. సంక్రాంతి తరువాత వీరి ఖాతాల్లో నిధులు జమ చేయనున్నది. ఈనెల 30న జరగనున్న కేబినెట్?సమావేశంలో మార్గదర్శకాలకు ఆమోదముద్ర వేయనున్నది. ఈ పథకం ద్వారా ప్రతి గ్రామంలో భారీ సంఖ్యలో రైతులను సంతృప్తి పర్చవచ్చని అధికార పార్టీ ఆలోచన.

**ఇందిరమ్మ ఇండ్లు.. రేషన్ కార్డులు...** పదేండ్లలో ఇండ్ల నిర్మాణాల విషయంలో బీఆర్ఎస్?వ్యవహరించిన తీరుపై గ్రామాల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొన్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల మంది లబ్ధిదారులను ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేయడం ద్వారా గ్రామాల్లో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు.

మొదట స్థలాలు ఉన్న వారికే ఇండ్లను కేటాయించనున్నారు. సంక్రాంతి తర్వాత కొత్త రేషన్?కార్డుల జారీ ప్రక్రియనూ ప్రభుత్వం ప్రారంభించనున్నది. అలాగే.. మాజీ ప్రజాప్రతినిధుల పెండింగ్ బిల్లులను సైతం విడుదల చేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నది. దీంతో కొన్ని సంవత్సరాలుగా బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న మాజీ ప్రజాప్రతినిధుల్లోనూ కాంగ్రెస్ పట్ల సానుభూతి ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**ఇరకాటంలోకి బీఆర్ఎస్...** ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్‌ను ఇరకాటంలోకి నెట్టి బలహీనమైంగా మార్చడం ద్వారా కిందిస్థాయిలో పోటీ లేకుండా, సులువుగా స్థానాలు గెలువవచ్చనే అంచనాలో కాంగ్రెస్ పార్టీ ఉన్నది. గులాబీ పార్టీ అధికారంలో ఉండగా చేసిన అక్రమాలన్నింటినీ ఒక్కొక్కటిగా తవ్వుతూ బయటకు తీస్తున్నది. ఈ క్రమంలో ఫార్ములా ఈ-కారు రేసు కేసు నమోదైంది. ఒకవైపు ఏసీబీ, మరోవైపు ఈడీ విచారణ ప్రక్రియను మొదలెట్టాయి. కేటీఆర్?జైలుకు వెళ్తే పార్టీ కేడర్?ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పలువురు మాజీ ఎమ్మెల్యేలు ఫోన్?ట్యాపింగ్?వ్యవహారంలో విచారణకు హాజరయ్యారు. రాబోయే రోజుల్లో మరికొంత మంది విచారణకు హాజరవుతారని సమాచారం.

# సంపాదకీయం

## షేక్ హసీనాను అప్పగింత ఇష్యూ... మోడీ సర్కార్ ఏం చేస్తుంది ?

ఒకనాడు బంగ్లాదేశ్ ని విజయవంతంగా పాలిస్తూ భారత్ కి రాచ మర్యాదలతో గౌరవప్రదమైన అతిధిగా వచ్చిన మాజీ ప్రధాని షేక్ హసీనా ఈ రోజు భారత్ లో తలదాచుకుంటున్నారు. ఆమె భారత్ కి వచ్చి దాదాపు అయిదు నెలలు కావస్తోంది. ఆమెని పదవీచ్యుతురాలిని చేసింది అక్కడ అంతర్యుద్ధం. అనంతరం తాత్కాలిక ప్రభుత్వం ఏలుబడిలోకి బన్గ్లాదేశ్ వెళ్ళిపోయింది. తాత్కాలిక ప్రభుత్వం భారత్ తో శత్రువు మాదిరిగా వ్యవహరిస్తోంది. బంగ్లాదేశ్ ఏర్పాటు వెనక భారత్ పోరాటం ఏమీ పెద్దగా లేదని తాత్కాలిక ప్రభుత్వంలో ఉన్న వారు కానీ అక్కడ రాజకీయ నాయకులు కానీ అంటూ భారత్ పట్ల తమ ద్వేషాన్ని చాటుకుంటున్నారు ఈ రోజుకీ బంగ్లాదేశ్ లో హిందువుల మీద దాడులు ఆగడంలేదు. దేవాలయాల విధ్వంసం కూడా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇపుడు అసలైన అగ్ని పరీక్షగా మోడీ సర్కార్ ముందు ఒకటి వచ్చి పడింది. భారత్ లో ఉంటున్న షేక్ హసీనాను తమకు అప్పగించాలని తాజగా బంగ్లాదేశ్ నుంచి ప్రభుత్వానికి ఒక లేఖ వచ్చింది. దీనిని బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సలహాదారు మహ్మద్ తౌహిద్ హుస్సేన్ అధికారికంగా ధృవీకరించారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాను వెనక్కి పంపాలని దౌత్య ప్రక్రియ ద్వారా భారత ప్రభుత్వానికి సందేశం పంపామని ఆయన చెప్పారు. తమ దేశానికి ఆమె కనుక వస్తే తాము మెను ప్రాసిక్యూట్ చేయాలనుకుంటున్నామని కూడా స్పష్టం చేశారు. అందువల్ల ఆమె బంగ్లాకు తిరిగి రావాలని డిమాండ్ చేస్తున్నామని కూడా చెప్పారు. మరో వైపు చూస్తే ఈ ఏడాది అక్టోబర్ 17న బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ షేక్ హసీనాపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఈ ఉత్తర్వును అమలు చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని బంగ్లాదేశ్ ప్రభుత్వం తెలిపింది. అంతే కాదు బంగ్లాదేశ్ భారత్ ల మధ్య ఉన్న పరస్పర అప్పగింతల ఒప్పందాల మేరకు మాత్రమే షేక్ హసీనాను తమ దేశానికి అప్పగించాలని కోరుతున్నామని చెబుతోంది. ఈ అప్పగింతల ఒప్పందం ప్రకారం రెండు దేశాల మధ్య నేరస్తులను అప్పగించుకునేందుకు వీలుంది. 2013లో ఈ ఒప్పందం ఆనాటి యూపీఏ ప్రభుత్వం బంగ్లా ప్రభుత్వం ల మధ్య కుదిరాయి. ఆ సమయంలో బంగ్లాకు ప్రధానమంత్రిగా షేక్ హసీనా ఉన్నారు. మరి ఇపుడు అదే ఒప్పందం చూపించి ఆమెను బంగ్లాదేశ్ కి పంపించాలని కోరుతున్నారు. అయితే ఈ అప్పగింతల ఒప్పందంలో నేరస్తులు హత్యలు చేసిన వారు ఇతరమైన దారుణాలకు పాల్పడిన వారిని మాత్రమే పరస్పరం అప్పగించుకోవాలని ఉంది అని అంటున్నారు. అంతే తప్ప రాజకీయ నేరాలు లేక ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి ఈ అప్పగింతల ఒప్పందం వర్తించదని అంటున్నారు. ఒప్పందంలోకి ఆర్టికల్ 6 ప్రకారం ఒకరిని అప్పగించలేని పరిస్థితులు కూడా ఆయా దేశాలు పేర్కొనవచ్చు అని అంటున్నారు. మరి దీని ప్రకారం చూస్తే భారత్ షేక్ హసీనాను వెనక్కి పంపించకపోవచ్చు అని అంటున్నారు. ఈ రోజున చూస్తే బంగ్లాదేశ్ భారత్ మీద విషం చిమ్ముతోంది. హసీనా పాలనలో భారత్ తో మంచి సంబంధాలు ఉండేవి. అందువల్ల భారత్ బంగ్లాలో పరిస్థితులు గమనిస్తోంది. అవి సర్దుబాటు అయ్యేలా చూడాలని అనుకుంటోంది. ఇక 2025 జనవరి 20న అమెరికా కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణం చేయబోతున్నారు. ఆయన బంగ్లాదేశ్ వ్యవహారాల మీద ఫోకస్ పెడతారు అని అంటున్నారు. షేక్ హసీనా పట్ల ఆయనకు సానుభూతి ఉందని అంటున్నారు. దాంతో అమెరికా ఆలోచనలు అన్నీ చూసిన మీదట భారత్ దౌత్య పరంగా లేక ఇతర మార్గాల ద్వారా బంగ్లాదేశ్ విషయంలో నిర్ణయాలు తీసుకుంటుంది అని అంటున్నారు. అందువల్ల బంగ్లాదేశ్ కోరిన వెంటనే షేక్ హసీనాను ఇప్పట్లో పంపించకపోవచ్చు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# కీలక వర్సిటీలను వదిలేశారు..!




హైదరాబాద్ : ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ కోర్సుల కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైనా హైదరాబాద్‌లోని కీలక వర్సిటీలు జేఎన్‌టీయూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్.. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్‌ఆర్ట్స్‌లకు ఉపకులపతులు లేరు. వీసీలు లేకపోవడంతో విధానపరమైన నిర్ణయాలను తీసుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యార్థులకు సంబంధించిన అంశాలు, విద్యాసంవత్సరంలో చేపట్టాల్సిన చర్యలు, ఆచార్యులు, సహ ఆచార్యుల పదోన్నతుల వ్యవహారాలన్నీ పెండింగ్‌లో పడుతున్నాయి. ఇన్‌ఛార్జి వీసీలుగా వ్యవహరిస్తున్న ముగ్గురు ఐఏఎస్ అధికారులు ఆర్థికపరమైన అంశాలపై ఆచితూచి వ్యవహరిస్తుండడంతో ఆయా వర్సిటీ పరిపాలనా అధికారులు రోజులు గడిస్తేచాలు అన్నట్లుగా నెట్టుకొస్తు న్నారు.

**అంబేద్కర్, ఫైన్‌ఆర్ట్స్ వర్సిటీల మధ్య పీటముడి..**

జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని మాసాబ్‌ట్యాంక్ నుంచి తరలించేందుకు ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఫైన్‌ఆర్ట్స్, అంబేద్కర్ వర్సిటీల మధ్య పీటముడి బిగుసుకుంది. జూబ్లీహిల్స్‌లోని అంబేద్కర్ వర్సిటీలో పది ఎకరాలను ఫైన్‌ఆర్ట్స్‌కు కేటాయించడంతో తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. రెగ్యులర్ వీసీ ఉన్నట్లైతే స్థలాన్ని ఇచ్చేందుకు అవకాశం లేదంటూ ప్రభుత్వానికి వివరించే వారంటూ అంబేద్కర్ వర్సిటీ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది చెబుతున్నారు. వీసీ లేకపోవడంతో తమకు ఎలాంటి సమాచారం తెలియడం లేదంటున్నారు.

**ఉన్నత విద్యాశాఖకు తెలిసినా..**

ఈ మూడు వర్సిటీలకు వీసీలు లేకపోవడం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు ఉన్నత విద్యాశాఖలోని కొందరు ఉన్నతాధికారులకు తెలిసినా పట్టనట్టే వ్యవహరిస్తున్నారు. ఏటా 70వేలమంది ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్న జేఎన్‌టీయూ, అనుబంధ కళాశాలల్లో విద్యా ప్రమాణాలను తనిఖీ చేయడం లేదు. కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూ క్యాంపస్‌లోని వసతి గృహాల్లో ఆహారం బాగోలేదని విద్యార్థులు ఆందోళన చేస్తున్నా సరైన చర్యలు తీసుకోవడం లేదు. అబిడ్స్‌లోని జేఎన్ఏ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీళ్లు సక్రమంగా రాకపోవడంతో విద్యార్థులు కొద్దిరోజుల క్రితం మాసాబ్‌ట్యాంక్‌లోని వర్సిటీ క్యాంపస్‌కు వచ్చి నల్లాల వద్ద స్నానాలు చేశారు.

పదో షెడ్యూలు గడువు ముగిసిన నేపథ్యంలో అంబేద్కర్ విశ్వవిద్యాలయం తెలంగాణకే పరిమితమయ్యింది. పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహణ ఖర్చులు చెల్లించడం లేదు. రూ.250కోట్ల మేరకు బకాయిలు రావాల్సి ఉండగా.. ఈ అంశాన్ని ఉన్నతవిద్యాశాఖ అధికారులు ఏపీ ప్రభుత్వానికి వివరించి బకాయిలు ఇప్పించేందుకు చొరవ చూపడం లేదు.

# సన్నబియ్యం జనవరిలో ఇవ్వరట!



హైదరాబాద్ : బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు భగ్గుమంటున్నాయి. సరఫరా తక్కువగా, వినియోగం ఎక్కువగా ఉండటం ఇందుకు కారణం. మధ్యతరగతి ప్రజలు ప్రధానంగా వీటిని వినియోగిస్తారు. ప్రజల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం జనవరి నుంచి రేషన్ బియ్యంలో దొడ్డు రకాలకు బదులుగా సన్నవి పంపిణీ చేస్తామంటూ ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ ఇటీవల పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ ఉగాది నాటికి పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామంటూ ప్రకటించారు. సంక్రాంతి పండగ నుంచైనా సన్న బియ్యం అన్నం తిందామనుకున్న మధ్య, నిరుపేదలకు నిరాశే మిగిలింది.

**తక్కువ సాగు ఎందుకుంటే..**

సన్నరకంతో పోల్చితే దొడ్డురకం సాగు చేయడం రైతులకు సులువు. దొడ్డు ధాన్యం మూడు నెలల్లో పంట చేతికొస్తే.. సన్నవి నాలుగు నెలల సమయం తీసుకుంటుంది. తెగుళ్ల సమస్య కూడా అధికంగా ఉంటుంది. అందుకని రైతులు సన్నవి సాగు చేయడానికి ఇష్టపడటంలేదు. మార్కెట్‌లో వీటి కొరత ఏర్పడింది. కిలోకు కనిష్ఠ ధర రూ.60 పలుకుతోంది. స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో వ్యాపారులు ఇతర జిల్లాల నుంచి తెప్పించడంతో రవాణా ఛార్జీలు పెరగడంతో వీటి ధరపై ప్రభావం పడుతోంది. సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతోంది.

ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ చేస్తామంటూ ప్రకటించింది. సన్న వడ్లకు ప్రోత్సాహకంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తోంది. ఈ ప్రకటన చూసిన రైతులు జిల్లాలో 1,21,415 ఎకరాల్లో సాగు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులకు వాటిని విక్రయించడం భారంగానే మారింది. వ్యవసాయాధికారులు నిర్ధారణ చేయడానికి రోజుల తరబడి సమయం తీసుకుంటున్నారు.

**కొన్ని చోట్ల పంపిణీ చేసినా ధరలు దిగొచ్చేవి..**

ధాన్యాన్ని మర ఆడించి నాలుగు నెలలు పాతబడితేనే (మాగితేనే) అన్నం ముద్ద కాదనే నిపుణులు చెప్పారనే కారణం చూపుతూ పంపిణీని ఉగాదికి వాయిదా వేశారు. సాధారణంగా కొత్త బియ్యం కొన్నా.. ఎక్కువ శాతం మంది మాగిన తరువాతే తింటారు. పంపిణీ వాయిదా వేయకుండా జనవరి నుంచి కొన్ని చోట్లనైనా పంపిణీ చేస్తే కొందరికైనా లబ్ధి చేకూరుతుంది. బహిరంగ మార్కెట్‌లో వాటికి డిమాండ్ తగ్గి.. ధరలూ సామాన్యులకు అందుబాటులోకి వస్తాయి. గత ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేసినప్పుడు ఇలాగే జరిగింది. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా కూడా ఉంటుంది.

# ఆన్‌లైన్ పరిచయం.. జీవితం ఆగమాగం

హైదరాబాద్ : భైంసాకు చెందిన యువతికి హైదరాబాద్ యువకుడు ఇన్‌స్టాలో పరిచయమయ్యాడు. స్నేహం నటించి పరిచయం పెంచుకుని యువతిని నగరానికి రప్పించాడు. మాట్లాడదామంటూ హోటల్‌కు తీసుకెళ్లి నిర్బంధించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ యువతి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

మియాపూర్‌కు చెందిన బాలిక.. ఇన్‌స్టాలో పరిచయమైన ఓ యువకుడిని నమ్మి అతడితో వెళ్లిపోయింది. అవసరం తీర్చుకున్న నిందితుడు ఆమె పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడం భరించలేక హతమార్చాడు. మృతదేహాన్ని చెత్తకుప్పల్లో విసిరేసి పోలీసులకు దొరికిపోయాడు.

ఏటా ఇలాంటివి పదుల సంఖ్యలో నమోదవుతున్నాయి. బాలికలు, యువతులు పలువురు సామాజిక మాధ్యమాల్లో పరిచయమయ్యే వ్యక్తుల బారినపడుతున్నారు. అపరిచితులతో స్నేహం చేస్తూ లైంగిక నేరాల బాధితులుగా మారుతున్నారు. అవతలి వ్యక్తి నిజస్వరూపం తెలుసుకోకుండా ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. తాజాగా కలకలం రేపిన మియాపూర్‌కు చెందిన బాలిక హత్య కేసు ఇందుకు ఉదాహరణ.

**పరిణామాలు అంచనా వేయకుండా..**

సామాజిక మాధ్యమాల్లో అపరిచితులను నమ్మి మోసపోతున్న వారిలో 16–19 ఏళ్ల మధ్య వయసు వారే ఎక్కువని పోలీసులు చెపుతున్నారు. అవతలి వ్యక్తులను అంచనా వేయకపోవడం, భవిష్యత్తు పరిణామాలు ఊహించలేకపోవడమే కారణం. సామాజిక మాధ్యమాల ప్రభావం విపరీతంగా పెరిగింది. యువత నుంచి పెద్దలు, గృహిణులు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ తదితర మాధ్యమాలను ఉపయోగిస్తున్నారు. ఇంట్లో చిన్నారులూ వీటిపై వ్యామోహం పెంచుకుంటున్నారు. ఇంటర్‌కి చేరగానే పిల్లలకు ఫోన్లు కొనిస్తున్నారు. ఫోన్, సామాజిక మాధ్యమాలను ఎలా వినియోగించాలో, అపరిచితులతో స్నేహం వల్ల పరిణామాలను



వివరించడం లేదు

యువతుల్లా నటిస్తూ సామాజిక మాధ్యమాల్లో అమ్మాయిల ఫొటోలు సేకరించి బెదిరిస్తున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. కొందరు నేరగాళ్లు యువతుల డీపీలతో నకిలీ ఖాతాలు సృష్టించి యువతులకు ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపిస్తారు. అందంగా ఉన్నావంటూ ఫొటోలు సేకరిస్తారు. వాటిని నగ్నంగా ఉన్నట్లు మార్ఫింగ్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తుంటారు.

**పిల్లలను గమనిస్తూ ఉండాలి**

'కౌమార దశలోని పిల్లలు ఏంచేస్తున్నారో తల్లిదండ్రులు పర్యవేక్షిస్తుండాలి. వయసు పెరిగేకొద్దీ హార్మోన్ల ప్రభావం పెరుగుతుంది. విద్యాభ్యాసానికి కొత్త ప్రాంతాలకు వెళుతుంటారు. వారి ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ మార్గనిర్దేశం చేస్తుండాలి. స్నేహంగా మాట్లాడుతుంటే సమస్యలు చెప్పేందుకు పిల్లలు ముందుకొస్తారు. ఒకవేళ నేరగాళ్ల చేతికి చిక్కితే ఆలస్యం చేయకుండా పోలీసులను సంప్రదించాలి'– కాశిరెడ్డి, వనస్థలిపురం ఏసీపీ

# పేక మేడలు.. గాల్లో ప్రాణాలు

హైదరాబాద్ : నగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డే లేకుండా పోయింది. కొందరు అధికారుల అవినీతే అక్రమ నిర్మాణాలకు పునాదిగా మారింది. నిర్మాణదారులు కొందరు వారానికో స్లాబు నిర్మిస్తుంటే.. మరికొందరు ఇష్టానుసారం సెల్లారు గుంతలు తవ్వి పక్కనున్న భవనాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఈ తొందరపాటు చర్యలకు.. గచ్చిబౌలి సిద్ధిఖీనగర్‌లో జరిగిన దుర్ఘటన నిదర్శనం. గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. పక్కనే ఉన్న నానక్‌రామ్‌గూడలో డిసెంబరు, 2016లో నిర్మాణంలోని ఆరంతస్తుల భవనం పేకమేడలా కూలి 11 మంది కూలీలు చనిపోయారు. జీహెచ్ఎంసీ ప్రణాళిక విభాగం అధికారులు యజమాని వద్ద లంచం తీసుకుని, పనులను వేగంగా పూర్తి చేసుకోవాలని ఆదేశించడంతో.. యజమాని వాయు వేగంతో నిర్మాణ పనులను పూర్తి చేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ఇటీవలి ప్రమాదాలు..: ఆగస్టు 2023లో.. బహదూర్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మాణంలోని నాలుగంతస్తుల భవనం



పక్కకు ఒరిగింది. యజమాని రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని నాలుగంతస్తులు నిర్మిస్తుండగా.. పనులన్నీ పూర్తయ్యాక.. సంపు కోసం ఇంటి లోపల తవ్వకం పనులు చేపట్టగా.. భవనం పక్కకు ఒరిగింది. దీనిని కూల్చివేయించారు.

జులై, 2023లో.. చింతల్ జనవరి 7, 2023న..: కూకట్‌పల్లి భాజపా కార్యాలయం రోడ్డులో హాస్టల్ కోసం నిర్మాణ పనులు చేపట్టిన యజమాని.. వెంట వెంటనే పిల్లర్లు, స్లాబులను నిర్మించి ప్రమాదానికి కారణమయ్యారు. వేగంగా నిర్మాణ పనులు చేపట్టడంతో.. నాలుగో అంతస్తు స్లాబు వేస్తుండగా నిర్మాణం కుప్పకూలింది. ఇద్దరు కార్మికులు చనిపోయారు. శ్రీనివాసనగర్‌లో హైడ్రాలిక్ జాకీలను ఉపయోగించి మూడంతస్తుల భవనాన్ని పైకి లేపే ప్రయత్నం విఫలమైంది. అది పాతికేళ్లనాటి నిర్మాణం. రోడ్డుకన్నా కిందకు ఉండటంతో వర్షపునీరు ఇంట్లోకి చేరేది. జాకీలతో పునాదిని మూడు అడుగులు పైకి లేపాలని యజమాని ప్రయత్నం చేయగా.. ఉపాయం బెడిసికొట్టింది. భవనం 10డిగ్రీల మేర పక్కకు ఒరిగి పరిస్థితి ప్రమాదకరంగా మారింది. పోలీసులు వెంటనే జేసీబీలను తెప్పించి భవనాన్ని పూర్తిగా కూల్చారు.

# అన్నీ లోపాలే.. చేసేవి పాపాలే..!

నీలగిరి : మేడి పండు చూడ మేలిమై ఉండు.. పొట్టవిప్పి చూడ పురుగులుండు అంటూ వేమన పద్యాన్ని తలపిస్తున్నాయి స్థానిక హోటళ్లు. గల్లీ నుంచి ప్రధాన పట్టణాలలో ఉండే పేరుగాంచిన రెస్టారెంట్ల వరకు అంతటా ఇదే పరిస్థితి. తినుబండారాల తయారీలో కల్తీరంగు, రసాయనాలు విరివిగా వాడుతున్నారు. వంటలు తయారు చేసే ప్రదేశాలు, చేసే వారు శుభ్రత పాటించడం లేదని టాస్క్‌ఫోర్స్



బృందాలు చేస్తున్న దాడుల్లో బయట పడుతున్నాయి. వారాల తరబడి నిల్వ ఉంచిన చికెన్, మటన్ ఇతర పదార్థాలను విక్రయిస్తున్నారని గుర్తించారు. రోడ్లపై విక్రయించే స్ట్రీట్ ఫుడ్ తయారీ దారులేకాక.. స్టార్ హోటళ్లు సైతం నాసిరకం పదార్థాలను వడ్డిస్తున్నారని తేలింది. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల కొరత కారణంగా సకాలంలో తనిఖీలు చేయడం లేదు. మద్యం సిట్టింగ్ పర్మిషన్ ఉన్న నిర్వాహకులు చికెన్, మటన్, చేపలు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారని... నాసిరకం వస్తువులే కాక.. రంగులు, రసాయనాలు ఇతర హానికర వస్తువులు రుచి కోసం వాడుతున్నట్లు గుర్తించారు.

ఉమ్మడి జిల్లాలో హోటళ్లు

ఉమ్మడి జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం.. నల్గొండలో 3650, సూర్యాపేటలో 2800, యాదాద్రి భువనగిరిలో 2500 హోటళ్లు ఉన్నాయి. ఇక అనుమతి లేకుండా.. టిఫిన్లు, భోజనం, తిను బండారాలు తయారు చేసే వారు వేలాది మంది ఉండొచ్చని అంచనా.

**ప్రధాన పట్టణాల్లోనే..**

ప్రధాన పట్టణాల్లోని పేరున్న హోటళ్ల నిర్వాహకులే అక్రమాలకు పాల్పడుతున్నారని అధికారులు గుర్తించారు. నిబంధనలు అతిక్రమించిన కొన్నింటిపైన క్రిమినల్ కేసులు నమోదు చేశారు. చిన్నా, పెద్ద హోటళ్ల వారు లైసెన్స్ తీసుకొని ఆహారం అందజేయాల్సి ఉన్నా.. దరఖాస్తులు చేసుకోని వారు అనేక మంది ఉన్నారు. భోజనం, పిండి పదార్థాలు, స్వీట్లు, చిరుతిళ్లు తయారు చేస్తున్న వారు నాసిరకం వస్తువులు వాడుతున్నట్లు తేలింది.

**నిబంధనలు పాటించకుంటే చర్యలు**

జ్యోతిర్మయి, గెజిటెడ్ సేఫ్టీ జోనల్ అధికారి

ఆహార తయారీదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి తదితర పట్టణాల్లో ఉన్న పెద్ద హోటళ్లను తనిఖీ చేసి కేసులు నమోదు చేశాం. ప్రస్తుతం కోర్టు విచారణలో ఉన్నాయి. వినియోగదారులు పండగల సమయంలో ప్రత్యేక వంటకాలపై వచ్చే ఆఫర్లను చూసి మోసపోవద్దు.

# 'ఆసరా' పెంచండి.. హామీ నెరవేర్చండి

కుభీర : నాటి తెరాస ప్రభుత్వం రూ.2016 ఆసరా పింఛన్లను ఇస్తే తమ అవసరాలకు ఎంతగానో ఉపయోగపడ్డాయని కానీ, కొవిడ్ తర్వాత ప్రతీ వస్తువు, సేవల ధరలు భారీగా పెరగడంతో అవి ఏమూలకు సరిపోవడం లేదని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా ఆసరా పింఛన్లను రెట్టింపు చేస్తామంటే ఎంతో ఆశగా ఆ పార్టీకి మద్దతుగా నిలిచామని చెబుతున్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పింఛన్ల పెంపును పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. పాలక ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చే పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

**మాట నిలబెట్టుకోవాలి**

కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఆసరా పింఛన్లను పెంచుతుందని పింఛన్‌దారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వృద్ధులకు ఇచ్చే పింఛన్ రూ.2016 నుంచి 4016కు, దివ్యాంగుల పింఛన్ రూ.4016 నుంచి రూ.6016 పెంచి ఇస్తారని ఆశలు రేకెత్తించారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆసరా పెంచి అన్నివర్గాల లబ్ధిదారులకు చేయూత ఇచ్చి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుకున్నారు.



**పింఛన్ పెంచాలి: ఎస్‌కే ఇమ్రాన్, దివ్యాంగుడు, కుభీర**

ఆసరా పింఛన్ పెంపుపై ప్రభుత్వం ఆర్థిక మార్గాలు అన్వేషించాలి. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. లబ్ధిదారులకు పింఛన్ పెంచుతున్నట్లు శాసనసభ సమావేశాల్లో ప్రకటన చేయాలి. దివ్యాంగులకు ప్రయోజనం కల్పించి ఆదుకోవాలి.

**ప్రభుత్వ పరిశీలనలో ఉంది: విజయలక్ష్మి, డీఆర్డీఓ నిర్మల్**

ఆసరా పింఛన్ల పెంపు, పంపిణీ ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మాకు ఎలాంటి సమాచారం లేదు. పింఛన్లు పెంచి పంపిణీ చేసే అందుకవసరమైన దస్త్రాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం పింఛన్ పెంచి ఇస్తే పారదర్శకంగా పంపిణీ చేస్తాం.

**జిల్లాలో పింఛన్ల వివరాలిలా..**

బీడీ కార్మికులు: 62,389
వితంతువులు: 35,587
వృద్ధులు: 27,597
దివ్యాంగులు: 9,626
ఒంటరి మహిళలు: 2,107
గీతకార్మికులు: 267
నేత కార్మికులు: 43
ఫైలేరియా బాధితులు: 49

# గత వైభవం.. అభివృద్ధి చేస్తే సుందరం

బెల్లంపల్లి : సింగరేణి సంస్థ ఏళ్లపాటు నిర్వహించిన పవర్‌హౌస్‌కు నిరంతరం నీళ్లు అందించిన బెల్లంపల్లి పట్టణంలోని పోచమ్మ గొలుసుకట్టు చెరువును ప్రభుత్వానికి అప్పగించింది. గత ప్రభుత్వ హయాంలో ఈ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చారు. మిషన్ కాకతీయ కింద చెరువును రూ. 1.50 కోట్లతో అభివృద్ధి చేశారు. కట్ట బలోపేతం చేసి చేతులు దులుపుకొన్నారు. కట్టపైన ఏర్పాటు చేసిన నాలుగు సౌరశక్తితో నడిచే విద్యుత్తు స్తంభాలు కనిపించడం లేదు. పోచమ్మ చెరువు మూడు గొలుసు చెరువుల సముదాయంగా ఉంటుంది. బెల్లంపల్లి బూదగెస్ట్‌హౌజ్‌కు వెళ్లే దారిలో ఉన్న చెరువు వేసవిలోనూ నీటితో కళకళలాడుతుంది.

బెల్లంపల్లి బూదగెస్ట్‌హౌజ్‌కు వెళ్లే రోడ్డుకు ఇరుపక్కల పోచమ్మ చెరువు విస్తరించి ఉంది. పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చారు. గొలుసు చెరువులుగా వినియోగించిన ఈ పోచమ్మ చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి అన్ని అవకాశాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో తూతూమంత్రంగా కట్టను బలోపేతం చేసి నిర్లక్ష్యంగా మధ్యలోనే వదిలేశారు. చెరువు కట్టపై మొక్కలు నాటినా వాటిని రక్షించలేకపోయారు. మట్టి, ఇసుక అక్రమ రవాణాకు ఇది అడ్డదారిగా మారింది. సిమెంట్ రోడ్డు వీరి కోసమే అన్నట్లుగా ఉంది. పోచమ్మ చెరువు పక్కనే పిల్లల ఉద్యానవనం, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేశారు. పిల్లల ఉద్యానవనానికి సాయంత్రం పిల్లలతో వచ్చిన తర్వాత మినీ ట్యాంక్‌బండ్ వైపు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది.



కట్టపై వీధిదీపాలు లేవు. మరోవైపు మందుబాబులు ఇక్కడే పగలూ రాత్రీ తేడా లేకుండా మద్యం తాగుతున్నారు.

**గొలుసు చెరువుల అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి**

పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల పక్క నుంచి చెరువు విస్తరించి ఉంది. పక్కపక్కనే రెండు చిన్న చెరువులు ఉన్నాయి. రోడ్డు పక్కన పెద్ద చెరువు ఉంది. ఈ మూడు చెరువులను కలిపి అభివృద్ధి చేస్తే బెల్లంపల్లి పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచే అవకాశం ఉంటుంది. పోచమ్మ చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం.

**ఇలా చేయొచ్చు**

పోచమ్మ పెద్ద చెరువు మధ్యలో ఐలాండ్‌తో పాటు అక్కడే రెస్టారెంట్లు, ఉద్యానవనం ఏర్పాటు చేయడానికి అవకాశాలున్నాయి.

మూడు గొలుసు చెరువులను కలుపుతూ బోటింగ్ ఏర్పాటు చేయొచ్చు.

పెద్ద చెరువుతో పాటు చిన్నచెరువుల చుట్టు రోడ్లు నిర్మించవచ్చు.

తీగల వంతెన ఏర్పాటుకు అవకాశాలుంటాయి.

# క్లస్టర్లు పెంచితే.. కష్టాలు తీరు



భువనగిరి : పంటల లెక్కల ఆధారంగా 2017లో ప్రభుత్వం అయిదు వేల ఎకరాలకు ఒకటి చొప్పున క్లస్టర్ ఏర్పాటు చేసి ఏఈవోలను నియమించింది. కొందరిని శాశ్వత, మరికొందరిని ఒప్పంద, ఇంకొందరిని పొరుగు సేవల కింద ఏఈవోలుగా ఖాళీలను భర్తీ చేసి సేవలు అందించిన విషయం తెలిసిందే. వీరికి రైతు వేదికల నిర్వహణ బాధ్యతలను సైతం అప్పగించింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రస్తుతం సుమారు 20,83,653 ఎకరాలు సాధారణ సాగు ఉండగా, 17,89,628 ఎకరాల్లో ఆయా పంటల సాగును చేపట్టారు. పంటల సాగు విస్తీర్ణానికి సరిపడా క్లస్టర్లు లేక పోవడంతో వ్యవసాయ విస్తరణాధికారుల ద్వారా పూర్తిస్థాయిలో సేవలు అందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 314 క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టర్ పరిధిలో అయిదు వేల ఎకరాల చొప్పున లెక్కిస్తే 15 లక్షల ఎకరాలు మాత్రమే ఉండాలి. సుమారుగా 3 లక్షల ఎకరాలు అదనంగా ఉండటంతో ఏఈవోలపై పని భారం పెరిగి రైతులకు సరిగ్గా సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. పంటల విస్తీర్ణానికి అనుగుణంగా అదనంగా 60కి పైగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తేనే కష్టాలు తొలగిపోయే అవకాశం ఉంది. ఇదే సమస్యతో పంటల డిజిటల్ సర్వే తమ వల్ల కాదంటూ ఏఈవోలు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సమస్య నెలకొనడంతో కొన్ని రోజులు సర్వే నిలిచినా ఆ తర్వాత ప్రభుత్వ ఒత్తిడితో కొనసాగించిన విషయం తెలిసిందే. పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ప్రభుత్వం క్లస్టర్లు ఏర్పాటు చేయాలని రైతులు, ఏఈవోలు కోరుతున్నారు.

**రాజపేట మండలంలో పరిశీలిస్తే..**

యాదాద్రి, జనగామ, సిద్దిపేట మూడు జిల్లాల సరిహద్దు మండలం రాజపేట. ఈ ప్రాంతంలో సుమారు 38 వేల ఎకరాల వరకు సాగుకు యోగ్యమైన భూమి ఉంది. ఇందుకుగానూ గతంలో ప్రభుత్వం నాలుగు క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్క పాముకుంట క్లస్టర్‌లో తొమ్మిది పంచాయతీలకు గానూ సుమారు 10,400 ఎకరాలు సాగవుతుంది. బొందుగుల క్లస్టర్‌లో నాలుగు గ్రామ పంచాయతీలకు గానూ 9,600 ఎకరాలు, రఘునాథపురం క్లస్టర్ పరిధిలో అయిదు గ్రామాలకు సుమారు తొమ్మిది వేలకు పైగా ఎకరాలు, రాజపేట క్లస్టర్‌లో తొమ్మిది వేల ఎకరాల వరకు సాగు ఉంటుంది. ఇందుకుగానూ అదనంగా 3 లేదా 4 క్లస్టర్లుగా విభజించాల్సిన అవసరం ఉంది. విస్తీర్ణం పెద్దది కారణంగా ఉన్న ఏఈవోలపైనే అదనపు భారం పడుతుండటంతో పూర్తిస్థాయిలో రైతులకు న్యాయం జరగడం లేదని ఇక్కడివారంటున్నారు.

**49 రకాల విధులతో.. తప్పని తిప్పలు..**

ప్రభుత్వం రైతు వేదికల ద్వారా ఏఈవోలతో అన్నదాతల సేవలను విస్తృత పరిచింది.

వ్యవసాయ శాఖ పరిధిలోని 49 రకాల సేవలు అందేలా బాధ్యతలు అప్పగించారు.

పొలాల వద్దకు పంటల వివరాలు ట్యాబ్‌లో ఏఈవోలు నమోదు చేయాలి.

రైతుబంధు దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు.

రైతుబీమా లబ్ధిదారులు చనిపోతే నామినికి బీమా ఇప్పించాలి.

సీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద డబ్బులు జమకాకపోతే పరిశీలన చేయాలి. రైతుల ఖాతాలు ఈకేవైసీ జరిగేలా చూడాలి.

ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు నమోదు, తేమ శాతం పరిశీలించి ధ్రువీకరించాలి.

ఏఎస్‌వోలతో కలిసి పంట కోత ప్రయోగం (దిగుబడి అంచనా) నిర్వహించాలి.

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే నివేదికలు అందజేయాలి.

పంటల క్షేత్ర పరిశీలనతోపాటు యాజమాన్య పద్ధతులపై సూచనలు ఇవ్వాలి. ప్రభుత్వ పరంగా వచ్చే పథకాలు, రాయితీలు అందేలా చూడాలి. ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు వచ్చే ఆదేశాలను అమలు చేయడంతో పాటు రైతు వేదికల నిర్వహణ బాధ్యతలు చేపట్టాలి.

అదనపు పంటల విస్తీర్ణంతో పనిభారం పెరిగి ఆశించిన స్థాయిలో రైతులకు సేవలు అందడం లేదు.

# యువతకు రానుంది.. నైపుణ్యం



నల్గొండ : ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పట్టభద్రులకు అపార అత్యాధునిక ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను అడ్వాన్సు టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)లుగా ఆధునికీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. ఈ కేంద్రాల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐల సిలబస్ ఉండాలని స్పష్టం చేశారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు ఐటీఐ కళాశాల్లోనూ సంస్కరణలు మొదలయ్యాయి. ఈ మేరకు పాలిటెక్నిక్ కళాశాలలో కొత్త ఏటీసీల ఏర్పాటును పరిశీలించేలా చర్యలు తీసుకోనున్నారు. స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటీఐ, పాలిటెక్నిక్, ఏటీసీ కళాశాలను తీసుకు వచ్చే విధంగా కార్యాచరణ సిద్ధమైంది. రూ. 2,400 కోట్లతో టాటా సంస్థ, ప్రభుత్వం కలిసి రాష్ట్రంలోని 65 ఐటీఐ కళాశాలలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ)లుగా మార్చనున్నారు. వీటి అభివృద్ధికి 86 శాతం టాటా సంస్థ, 14 శాతం మేర రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు అందించి సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ డిసెంబరు 7న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా ఏటీసీ భవనం ప్రారంభమైన అందుబాటులోకి వస్తుందని అనుకున్నప్పటికీ అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంతో ప్రారంభోత్సవం నిర్వహించలేదు.

**ఆరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఆరు కోర్సుల్లో శిక్షణ**

నల్గొండలో ఒక బాలుర, ఒక బాలికల, అనుముల (హాలియా), డిండి కళాశాలలుండగా.. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున ఐటీఐలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం 1,500 మంది విద్యార్థులు ఇందులో ప్రవేశాలు పొందుతున్నారు. వీటన్నింటిలో ప్రస్తుతం 6 కోర్సులైన కంప్యూటరైజ్డ్ న్యూమెరికల్ కంట్రోల్(సీఎన్‌సీ), అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైన్ ఇన్ మెకానికల్, ఇండిస్ట్రీయల్ రోబోటిక్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చర్ టెక్నీషియన్, ఎలక్ట్రానిక్ వాహనాల మెకానిక్, మాన్యుఫాక్చర్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సులు ప్రవేశపెట్టనుండగా భవిష్యత్తులో 20 రకాలైన అత్యాధునిక కోర్సులకు డిమాండ్‌కు అనుగుణంగా ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం భవనాలన్నింటిలో పాఠ్యాంశాల బోధన జరుగుతుండగా ప్రారంభోత్సవాల అనంతరం ప్రాక్టికల్స్ నిర్వహణ, ఉద్యోగ మేళా కార్యక్రమాలు కూడా టాటా సంస్థ చేపట్టనుంది.

**80 శాతం పనులు పూర్తయ్యాయి** – నరసింహాచారి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, నల్గొండ

డిండి ఐటీఐ, నల్గొండ బాలురు, బాలికల కళాశాలలు, అనుముల ప్రాంతంలో ఐటీఐ కళాశాలలుండగా వీటన్నింటిలో ఏటీసీ కేంద్రాల భవనాలు నిర్మితమవుతున్నాయి. టాటా సంస్థ వారు 86 శాతం మేర నిధుల్లో భవన నిర్మాణ డిజైన్లు, అత్యాధునిక పరికరాలు, శిక్షణ సిబ్బంది, జీత భత్యాలు అన్నింటిని సమకూరిస్తే ప్రభుత్వం స్థలం, మౌలిక వసతులు కల్పించింది. టీజీఐఐసీ ఆధ్వర్యంలో సివిల్ వర్క్స్ జరుగుతున్నాయి. అత్యాధునిక పరికరాల బిగింపు పనులు మిగిలి ఉన్నాయి. ఎలక్ట్రికల్ కారు ట్రేడ్, మెకానికల్ ట్రెడ్ శిక్షకులు మాత్రమే వారికి తరగతులు బోధిస్తున్నారు. భవనం అందుబాటులోకి వచ్చాక మిగిలిన కోర్సులకు సైతం అన్నీ తరగతులు నిర్వహిస్తాం.

# భూ ఆక్రమణపై నోటీసులు

మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాల్లోని అటవీ భూములను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారని పేర్కొంటూ ఇటీవల ఆలయ అధికారులకు నోటీసు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. కొండగట్టు అంజన్న ఆలయం పేర దాదాపు 650 ఎకరాల భూములున్నాయి. దాదాపు 22 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ పరిసరాలు విస్తరించి ఉన్నాయి. మిగిలిన భూములు మల్యాల, కొడిమ్యాల మండలాల పరిధిలో ఉన్నాయి. వాటిలో అత్యధికంగా మల్యాల మండలం ముత్యంపేట పరిధిలోనే ఉన్నాయి. కొండపైన 360 హెక్టార్లలో అటవీ ప్రాంతం ఉంది. ఏళ్ల కిందట కొండపైన అటవీ భూముల్లో పలు నిర్మాణాలు చేపడితే చూసీచూడనట్లు వ్యవహరించిన అటవీశాఖ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేయడమేంటని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొండపైన దాదాపు 15 ఏళ్ల కిందట నిర్మించిన సాగర్ అతిథి గృహం, పదేళ్ల కిందట నిర్మించిన ఈవో కార్యాలయ భవనం, ధర్మసత్రం, హరిత గెస్ట్ హౌజ్ ప్రాంతం, దాదాపు 30 ఏళ్ల కిందట నిర్మించిన బస్టాండుతోపాటు ఈవో కార్యాలయం ముందు ఖాళీ స్థలం అటవీశాఖకు చెందినదని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. దాదాపు 6 ఎకరాల అటవీ భూములను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారని అటవీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తుండటంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కొండగట్టుపై 'వై' జంక్షన్ సమీపంలో అటవీ భూముల రక్షణకు గోడ, ఫెన్సింగ్ నిర్మాణ పనులకు టెండర్లు కూడా పూర్తయినట్లు తెలిసింది. ఇటీవల గుత్తేదారు కందకం తవ్వడంపై అధికార పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో తాత్కాలికంగా నిలిపివేసినా ఫెన్సింగ్ పనులు చేపట్టనున్నట్లు అటవీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈవో కార్యాలయ భవనం వెనుకవైపు అటవీ ప్రాంతంలో రెండో వాచ్‌టవర్ నిర్మాణ పనులు కూడా చేపట్టారు. అంతేకాకుండా అటవీ ప్రాంతం నుంచి జేఎన్టీయూ కళాశాలకు వెళ్లే మార్గం వరకు భక్తుల కోసం నడక మార్గం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. 'వై' జంక్షన్ సమీపంలో అటవీ అధికారులు కాంక్రీటుతో నిర్మించిన కుటీరంలాంటి షెడ్డు ప్రాంతంలో పార్కు నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం చేపట్టినవే..కొండగట్టు ఆలయ పరిసరాల్లో ఏళ్ల కిందట నిర్మించిన పలు భవనాలు అటవీ ప్రాంతంలో నిర్మించినట్లు పేర్కొంటూ సంబంధిత అధికారులు అందజేసిన నోటీసుకు సమాధానం పంపిస్తున్నాం. ఒకవేళ అధికారులు పేర్కొన్నట్లు 6 ఎకరాల అటవీ భూముల్లో నిర్మాణాలు చేపట్టినట్లు తేలితే దేవాదాయశాఖ కమిషనరు దృష్టికి తీసుకెళ్లి అందుకు రెట్టింపు ఆలయ భూమిని అటవీశాఖకు అప్పగిస్తాం.

# నిర్లక్ష్యపు వ్యథ.. ఇది మానేరు కథ

కరీంనగర్: ఈ చెక్‌డ్యామ్‌ను ఆరు నెలల కిందటే పూర్తి చేయాలి. సకాలంలో పూర్తి చేయకపోవడంతో ఇలా నీటి ప్రవాహం మధ్యలో ఇనుపచువ్వలు ఉండిపోయాయి. ఫిల్లర్ల నిర్మాణాన్ని ఇంకా చేపట్టాల్సి ఉంది. మొత్తంగా 15 ఫిల్లర్లలో ఒకదాన్ని మాత్రం సిమెంట్‌తో నిర్మించి వదిలేశారు. దీన్ని పూర్తి చేస్తేనే పర్యాటకుల ఆహ్లాదానికి అవకాశముంటుంది. పైగా ఇరువైపులా నిర్మించిన మట్టి కట్టలో ఒకవైపు 32 బ్లాక్స్ పూర్తి కాగా, మరోవైపు ఇంకా సగం మట్టి, రాళ్లు నింపాల్సి ఉంది. ఇన్నాళ్లపాటు మానేరు నదిలో నుంచి తీసుకొచ్చిన మట్టిని పోయగా.. రివర్‌ఫ్రంట్ పనుల ప్రదేశంలో ఉన్న రాళ్లనే ఈ కట్ట నిర్మాణానికి వినియోగించారు.మానేరు నది ప్రధాన గేట్ల దిగువన దాదాపు 3 కి.మీ మేర నిర్మించే ఈ రివర్‌ఫ్రంట్ పనులు ఒకడుగు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అనే విధంగానే సాగుతున్నాయి. పనుల ప్రగతిలో ఆరంభశూరత్వమనేది స్పష్టంగా కనిపిస్తోంది. దీని నిర్మాణానికి రూ. 470 కోట్లను వెచ్చించాలనుకున్నారు. నీటిపారుదల, పర్యాటక శాఖలు నిర్మాణ బాధ్యతలు చేపట్టాయి. ఇరువైపులా మట్టి, రాళ్లను నింపే పని మాత్రమే పూర్తయింది. మొదటి దశ పనుల్లో భాగంగా దాదాపు 74 శాతం పని పూర్తయినట్లు అధికారులు



చెబుతున్నారు. ఇందుకోసం రూ. 201 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఏడాది మే నాటికి ఈ మొదటి దశ పనులు పూర్తికావాల్సి ఉండగా.. వచ్చే ఏడాది నాటికి కొలిక్కి వచ్చే వీలుంది.

**మళ్లీ.. రూ.234 కోట్లు విడుదల..**

ఇటీవల మళ్లీ మిగులు పనుల కోసం రూ. 234 కోట్లు విడుదలయ్యాయి. వీటితో రెండో దశ పనులను చేపట్టబోతున్నారు. గతంలో నిర్మించకుండా వదిలేసిన మురుగు, వరదకాలువల కోసం రూ. 60 కోట్లు వెచ్చించబోతున్నారు. మిగతా మొత్తాన్ని చెక్‌డ్యామ్ నిర్మాణంతో పాటు మిగతా నింపాల్సిన మట్టి, రాళ్ల కోసం వెచ్చిస్తారు. మొదట్లో ఈ రివర్ ఫ్రంట్ పనుల అంచనా రూ. 410 కోట్లు అని ప్రారంభించగా.. తర్వాత ఈ వ్యయం విలువ రూ. 470 కోట్లకు చేరింది. ఈ నిధులు పూర్తి స్థాయి పనులకు సరిపోవనేది స్పష్టమవుతోంది. ఫౌంటెయిన్ నిర్మాణంతోపాటు పర్యాటక శాఖ తరపున చేపట్టాల్సిన వాటికి కూడా నిధులు అవసరమవుతాయి.

ఇలా.. నగరంలో నుంచి వెలువడే మురుగంతా.. మానేరు రివర్‌ఫ్రంట్‌లోకే వెళ్తుంది. రాంపూర్, అంబేద్కర్ మైదానం, శనివారం మార్కెట్ ప్రాంతాల నుంచి ఉన్న నాలాలన్నీ.. ఇందులో కలుస్తాయి. వాస్తవానికి ఇరువైపులా కట్టను నిర్మించడానికి ముందుగానే పాత వంతెన నుంచి తీగల వంతెన అవతలి వరకు మురుగు, వాన నీరు వెళ్లే కాలువ నిర్మించాలి. అలా చేయకుండానే మట్టి, రాతికట్టడాలను నిర్మించడంతో ఇబ్బంది నెలకొంది. మురుగును శుద్ధి చేయకుండానే మానేరులోకి వదిలితే పరివాహక ప్రాంత రైతులకు.. పర్యాటకులకు వాసన ముప్పు తప్పదు. కరీంనగర్, సదాశివపల్లి, అలుగునూర్‌ల నుంచి వెలువడే వ్యర్థాల విషయంలో అవసరమైన మార్పులు చేపట్టాలి.

**త్వరితగతిన పూర్తి చేస్తాం**

పనుల విషయంలో పర్యవేక్షణ పెంచుతున్నాం. మొదటి దశ పనులు వచ్చే ఏడాది మే నాటికి పూర్తవుతాయి. ప్రస్తుతం కట్టలకు ఇరువైపులా మురుగుకాలువ వ్యర్థాలు వెళ్లేందుకు వీలుగా కాలువల నిర్మాణాలు చేపడతాం. ఇటీవల రెండో విడుత నిధులు విడుదలయ్యాయి. అవసరమైన పనులన్నింటిని త్వరితగతిన పూర్తిచేస్తాం. – నాగభూషణం, ఈఈ, నీటి పారుదలశాఖ, కరీంనగర్

# అడవి తగ్గుతోంది..

ఆదిలాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవులకు ప్రసిద్ధి..అలాంటిది ప్రస్తుతం అరణ్యాల విస్తీర్ణం బాగా తగ్గిపోతోంది. మంచిర్యాల మినహా మిగిలిన మూడు జిల్లాల్లో అటవీ విస్తీర్ణం తగ్గినట్లు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ ఇటీవల విడుదల చేసిన ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్(ఐఎస్ఎఫ్) 2023 వెల్లడించింది. రాష్ట్రం మొత్తంలో అటవీ విస్తీర్ణంలో పూర్వ ఆదిలాబాద్ జిల్లా గతంలో మొదటి స్థానంలో ఉండేది. జిల్లాల విభజన తర్వాత కుమురంభీం జిల్లా మూడో స్థానానికి చేరుకుంది. అటవీ విస్తీర్ణం పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నా జిల్లాల్లో ఆశించిన స్థాయిలో అటవీ ప్రాంతం పెరగడం లేదని ఈ నివేదికలతో స్పష్టం అవుతోంది.దేశంలో అడవుల విస్తీర్ణం, పెరుగుదల తదితర వాటికి సంబంధించిన ఐఎస్ఎఫ్ నివేదికలను కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ఇటీవల విడుదల చేశారు. ఆ నివేదిక ప్రకారం అటవీ విస్తీర్ణం తగ్గుదలలో తెలంగాణ దేశంలో మూడో స్థానంలో నిలిచింది. పూర్వ జిల్లాలవారీగా ఉమ్మడి ఆదిలాబాద్ భౌగోళిక విస్తీర్ణం 16,105 చదరపు కి.మీలుకాగా 5,743.42 చదరపు కి.మీల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది.

**మొక్కలు నాటినా..**

తాజా నివేదికలో జిల్లాలవారీగా అటవీ విస్తీర్ణాన్ని వెల్లడించారు. హరితహారం పేరిట జిల్లాల్లో ఇప్పటి వరకు 20 కోట్ల మొక్కలు నాటినట్లు అటవీశాఖ చెబుతోంది. ఈ లెక్కన జిల్లాలవారీగా అటవీ విస్తీర్ణం పెరగాలి. కానీ నివేదికలో మంచిర్యాల జిల్లాలో మినహా మిగిలిన మూడు జిల్లాల్లో తగ్గినట్లు ఉంది. రాష్ట్రంలో అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 115.50 చ.కి.మీలు, నిర్మల్ జిల్లాలో 45.37 చ.కి.మీలు, కుమురంభీం జిల్లాలో 44.61 చ.కి.మీలు తగ్గింది. మంచిర్యాల జిల్లాలో మాత్రం 34.96 చ.కి.మీల విస్తీర్ణం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది.

**పోడుతోపాటు స్మగ్లింగ్**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక గ్రామాలు అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు జీవనోపాధి కోసం సమీప అటవీ భూములను వ్యవసాయానికి అనుకూలంగా మలుచుకోవడంతో అటవీ విస్తీర్ణం తగ్గుతూ వస్తుంది. ఇక్కడ ఉన్న నాణ్యమైన టేకుకు విలువ ఎక్కువగా ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో ఈ వృక్షాలను నరికి స్మగ్లింగ్ చేస్తున్నారు. అధికారులు ఎంత నిఘా పెట్టినా గుట్టుచప్పుడు కాకుండా కలప తరలిపోతుంది. దీంతోపాటు ఒకటిగా ఉన్న గ్రామాల్లోని జనం మధ్య భేదాభిప్రాయాలు వస్తుండటంతో విడిపోయి సమీప అటవీ ప్రాంతాన్ని చదును చేసుకొని మరో గ్రామాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు.

**సింగరేణి సంస్థతో..**మంచిర్యాల జిల్లాలో బొగ్గు గనులు ఉండటంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా అక్కడి సింగరేణి సంస్థ కోట్లల్లో మొక్కలు నాటి అటవీ సంపదను సృష్టించడంతో కొంత అటవీ ప్రాంతం పెరిగినట్లు భావిస్తున్నారు.తగ్గిన అగ్ని ప్రమాదాలు

అటవీ ప్రాంతాల్లో జరిగే అగ్ని ప్రమాదాలు గతంతో పోలిస్తే తగ్గాయి. 2023 నవంబరు నుంచి 2024 జూన్ మధ్యలో జరిగిన ప్రమాదాలను నివేదికలో వెల్లడించారు. అటవీ అగ్ని ప్రమాదాలు అత్యధికంగా నిర్మల్ జిల్లాలో చోటుచేసుకున్నాయి. అయితే గతంతో పోలిస్తే నాలుగు జిల్లాలో అగ్ని ప్రమాదాల్లో తగ్గుదల ఉంది.

# అడవులకు ముప్పు.. నిప్పు!

కొత్తగూడెం : పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవులు కీలక భూమిక పోషిస్తాయి. అనేక జంతు, వృక్షజాతులకు ఆశ్రయం కల్పించి జీవవైవిధ్యాన్ని సంరక్షించేందుకు తోడ్పడతాయి. భూసారాన్ని కాపాడతాయి. నేల క్షీణతను నిరోధిస్తాయి. ఒక విధంగా చెప్పాలంటే మానవ మనుగడకు అడవులే ఆధారం. 2021 నుంచి 2023 వరకు భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో అటవీ విస్తీర్ణం తగ్గటం ఆందోళన కలిగించే అంశం. ఉభయ జిల్లాల్లో మూడేళ్ల వ్యవధిలో 121.21 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం తగ్గినట్లు 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్టు రిపోర్టు-2023' వెల్లడించింది.

**కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ మినహా...**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలోని ఎనిమిది అటవీ డివిజన్లలో ఒక్క కిన్నెరసాని వైల్డ్‌లైఫ్‌లో మినహా మిగతా వాటిలో అటవీ విస్తీర్ణం తగ్గినట్లు తాజా నివేదిక వెల్లడించింది. 2021లో కిన్నెరసాని అటవీ విస్తీర్ణం 418.84 చ.కి.మీ. ఉండగా 2023 చివరి నాటికి 420.73 చ.కి.మీ.కి పెరిగింది. పాల్వంచ డివిజన్ పరిధిలో అత్యధికంగా 35.00చ.కి.మీ. అటవీ విస్తీర్ణం తగ్గింది. ఆ తర్వాత రెండు, మూడు స్థానాల్లో భద్రాచలం డివిజన్‌లో 28.47చ.కి.మీ., సత్తుపల్లి డివిజన్‌లో 18.51చ.కి.మీ. అటవీ విస్తీర్ణం క్షీణించింది. అటవీ విస్తీర్ణం అత్యల్పంగా తగ్గిన డివిజన్లలో ఖమ్మం(-1.70) మొదటి స్థానంలో.. కొత్తగూడెం(-2.24)తో రెండో స్థానంలో ఉన్నాయి.

జిల్లాల వారీగా.. 2021-23 మధ్యకాలంలో భద్రాద్రి జిల్లాలో 95.55చ.కి.మీ., ఖమ్మం జిల్లాలో 25.76 చ.కి.మీ. అటవీ విస్తీర్ణం తగ్గింది. ఇందుకు సంబంధించిన నివేదికను కేంద్ర మంత్రి భూపేంద్రయాదవ్ ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఆ నివేదిక ప్రకారం..

2021లో 2,957.21చ.కి.మీ. అటవీ విస్తీర్ణం కలిగిన భద్రాద్రి జిల్లా 2023 చివరి నాటికి 2,861.66 చ.కి.మీ.కి తగ్గింది.

ఖమ్మం జిల్లాలో 2021లో 633.23చ.కి.మీ. అటవీ విస్తీర్ణం ఉండగా 2023 ముగిసే నాటికి 607.47 చ.కి.మీ.గా నమోదైంది.

రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణం తగ్గిన జిల్లాల జాబితాలో ఆదిలాబాద్ (-115.50) తర్వాత భద్రాద్రి జిల్లా(-95.55) రెండో స్థానంలో నిలవగా.. ఖమ్మం ఏడో స్థానంలో ఉంది.

భద్రాద్రి జిల్లాలో ప్రమాదాలు అధికం

అటవీ అగ్నిప్రమాదాలు భద్రాద్రి జిల్లాలో అత్యధికంగా చోటుచేసుకోవటం కలవరపరుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2023లో జరిగిన అటవీ అగ్నిప్రమాదాల జాబితాలో భద్రాద్రి కొత్తగూడెం 2,600 ప్రమాదాలతో మొదటి స్థానంలో నిలవగా.. ములుగు జిల్లా 2,597 ప్రమాదాలతో రెండో స్థానంలో ఉంది. ఇదే సమయంలో ఖమ్మం జిల్లా 260 అగ్నిప్రమాదాలతో 13వ స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా భద్రాద్రి జిల్లా ఎనిమిదో స్థానంలో ఉంది.

# మళ్లీ ప్రతిపాదనలు.. వచ్చేనా అనుమతులు?

కొత్తగూడెం : ముర్రేడు రక్షణ గోడ నిర్మాణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఏటా వర్షాకాలంలో సంభవిస్తున్న భారీ వర్షాలకు ముర్రేడు ఉగ్రరూపం దాల్చుతుండటంతో నది పరీవాహక ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉద్ధృతంగా ప్రవహించటంతో నది తీరం కోతకు గురవుతోంది. ఏటా పదుల సంఖ్యలో ఇళ్లు నీటమునుగుతున్నాయి. ఈ సమస్యలను గుర్తించిన గత ప్రభుత్వం రక్షణ గోడ నిర్మాణానికి రూ.33.50కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. గతేడాది శాసనసభ ఎన్నికల ముందు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నాటి పాలకులు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో పనులు పట్టాలెక్కలేదు.

**ఎన్నికల హామీగా మిగులుతున్న సమస్య**

కొత్తగూడెం పట్టణాన్ని చీల్చుకుంటూ.. ముర్రేడు వాగు ప్రవహిస్తుంది. ఏటా వానాకాలంలో ముర్రేడు వాగును ఆనుకొని ఉన్న కాలనీలు జలమయమవుతున్నాయి. ప్రధానంగా సంజయ్‌నగర్ పంచాయతీ పరిధిలోని కొన్ని నివాసాలు, ప్రశాంతినగర్‌లో ఓ పాఠశాల భవనం కోతకు గురవుతున్నాయి. ఏళ్లుగా తమ సమస్యను పాలకులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావటం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే పాలకులకు తాము గుర్తుకొస్తున్నామని, అప్పుడే రక్షణ గోడ నిర్మాణానికి హామీ ఇస్తున్నారని.. ఆ తర్వాత మరిచిపోతున్నారని మండిపడుతున్నారు.



**రూ.45 కోట్లతో నూతన ప్రతిపాదనలు**

స్థానిక ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ముర్రేడు వాగు రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన నూతన ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వం ఆదేశించిందని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. అందుకు అనుగుణంగా రూ.45కోట్లతో గాబ్రియల్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి నీటిపారుదలశాఖ ఈఎన్‌సీకి పంపించామని తెలిపారు. అక్కడి నుంచి ప్రభుత్వం దృష్టికి వెళ్లి పరిపాలన, ఆర్థికపరమైన అనుమతులు లభిస్తే టెండర్లు పిలవటానికి అవకాశం ఉంటుందంటున్నారు. రక్షణ గోడ నిర్మాణానికి బదులుగా జిల్లాలో మొదటిసారిగా ప్రయోగాత్మకంగా 1.60కి.మీ. పొడవైన గాబ్రియల్ వాల్ ఏర్పాటుకు గతంలోనే అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పుడు కూడా అదే నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని చెబుతున్నారు.

**మంత్రులు దృష్టి సారిస్తేనే..**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కీలక పాత్ర పోషించింది. రాష్ట్ర మంత్రివర్గంలో మల్లు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి స్థానం దక్కింది. మంత్రులు భద్రాద్రి జిల్లాపైనా ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా ముర్రేడు ప్రాంత వాసుల సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నుంచి రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన పరిపాలన, ఆర్థికపరమైన అనుమతులు త్వరగా వచ్చేలా కృషిచేయాలని వేడుకుంటున్నారు.

ముర్రేడు రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించి రూ.45 కోట్లతో నూతన ప్రతిపాదనలను ఈఎన్‌సీకి పంపించాం. ప్రభుత్వం నుంచి పరిపాలన, ఆర్థికపరమైన అనుమతులు రాగానే టెండర్ ప్రక్రియ చేపడతాం.
రవికుమార్, డిప్యూటీ సీఈ, భద్రాద్రి కొత్తగూడెం

# పట్టాలెక్కిన పనులు.. నిరుద్యోగుల్లో ఆశలు



ఖమ్మం: మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్నట్టు సాగిన ఐటీహబ్-2 నిర్మాణ పనులు ఎట్టకేలకు పట్టాలెక్కాయి. ఖమ్మంలో ఐటీ హబ్ విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఇటీవల ఆదేశించిన విషయం విదితమే. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవటంతో పనులు చకచకా సాగేలా టీజీఐఐసీ అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే ఖమ్మంలో ఐటీ హబ్-1 ద్వారా వందలాది మందికి ఐటీ కొలువులు దక్కగా.. ఐటీ హబ్-2 నిర్మాణం పూర్తయితే తమకూ స్థానికంగానే ఉద్యోగాలు వస్తాయని ఇక్కడి నిరుద్యోగులు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

**మంత్రి తుమ్మల చొరవతో ముందడుగు**

ఖమ్మం నగరం నడిబొడ్డున ఐటీ హబ్-1లో ప్రస్తుతం 13 కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇప్పటివరకు 700 మందికి ఉద్యోగావకాశాలు దక్కాయి. ఖమ్మం నగరం అభివృద్ధి చెందుతుండటంతో ఇక్కడ ఐటీ సేవలను విస్తరించేందుకు ప్రముఖ కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఈనేపథ్యంలోనే ఐటీ హబ్-2 నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంది. మూడున్నరేళ్ల క్రితమే ఐటీ టవర్ నిర్మాణానికి బీజం పడినా.. పనులు అనుకున్న స్థాయిలో ముందుకు సాగలేదు. ఏడాది కాలంలోనే నిర్మాణం పూర్తిచేసి ఐటీ ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నప్పటికీ.. అనేక కారణాలతో ఐటీ హబ్ విస్తరణ పనులు నత్తను తలపించాయి. ఐటీ హబ్-2 నిర్మాణంపై అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల దిశానిర్దేశం చేయటంతో పనులు మళ్లీ గాడినపడుతున్నాయి. కలెక్టర్, టీజీఐఐసీ అధికారులతో సమీక్ష జరిపి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని మంత్రి ఆదేశించారు.

**వచ్చే ఏడాదిలో ఐటీ కొలువులు..!**ఐటీ కొలువుల కోసం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి ఐటీ అభ్యర్థులు ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు వెళ్తున్నారు. అయితే.. జిల్లాలకు ఐటీ హబ్‌లు విస్తరించటం వల్ల స్థానికంగా ఉద్యోగాలు పొందే అవకాశం కలుగుతోంది. ప్రస్తుతం ఐటీ హబ్-1లో వివిధ కంపెనీల్లో ఉద్యోగులుగా ఉన్న యువతీ యువకులంతా ఉభయ జిల్లాల్లోని మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చినవారే. స్థానికంగా ఉద్యోగాలు పొందటం ద్వారా.. కుటుంబాలతో కలిసి ఉంటూ కొలువులు చేస్తున్నారు. ఐటీ హబ్-2 అందుబాటులోకి వస్తే వందలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. కొత్త ఏడాదిలో స్థానికంగా ఐటీ కొలువులు కల్పించేలా ప్రభుత్వం, టీజీఐఐసీ అధికారులు చొరవ చూపాలని నిరుద్యోగులు కోరుతున్నారు. 'ఐటీ సేవలను విస్తరించే క్రమంలో ఖమ్మంలో ఐటీ హబ్-2కు శ్రీకారం చుట్టాం. నిర్మాణ పనుల్లో వేగం పుంజుకుంది. త్వరితగతిన పూర్తిచేసి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిరుద్యోగులకు ఐటీ ఉద్యోగాలు కల్పిస్తాం' అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు తెలిపారు.

# ఉల్లి.. వెల్లుల్లి.. ధరల లొల్లి!



ఖమ్మం : ప్రస్తుతం విపణిలో ఉల్లి, వెల్లుల్లి ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. ఈ రెండు పంటలను స్థానికంగా పండించకపోవటమే దీనికి ప్రధాన కారణం. కొన్నేళ్ల నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ కొంతమంది రైతులు తమ కుటుంబ అవసరాల కోసం స్వల్ప విస్తీర్ణంలో వీటిని సాగు చేస్తున్నారు. ఫలితంగా వినియోగదారులు వీటి కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

**మధ్యప్రదేశ్, మహారాష్ట్రపైనే ఆధారం**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు ఉల్లిగడ్డలను మహారాష్ట్ర నుంచి, వెల్లిపాయలను మధ్యప్రదేశ్ నుంచి టోకు వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, వైరాతోపాటు కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట తదితర ప్రాంతాలకు ఆయా రాష్ట్రాల నుంచి నేరుగా లారీల ద్వారా సరకు రవాణా అవుతోంది. ఖమ్మం నగరానికి వస్తున్న సరకును సూర్యాపేట, మహబూబాబాద్, మరిపెడ ప్రాంతాలకు చెందినవారూ కొనుగోలు చేస్తున్నారు. అదే విధంగా టోకు దుకాణాలు, మార్కెట్లు, రైతుబజార్లు, కూరగాయల దుకాణాల్లో ఎక్కువగా వీటిని విక్రయిస్తున్నారు.

**పెరిగేదెప్పుడో.. తగ్గేదెప్పుడో?**

ప్రస్తుతం రకాలను బట్టి ఉల్లి ధర కిలో రూ.40 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. పక్షం రోజుల క్రితం కిలో రూ.70 వరకు ఉండటంతో సామాన్యులు కొనలేకపోయారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిల్లర దుకాణాల్లో ఈ ధర మరింత ఎక్కువగా ఉంటోంది. కూరలు, ఇతర అవసరాల్లో ఎక్కువగా ఉపయోగించే సరకు కావటం వల్ల పెరిగిన ధరలతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఖమ్మం నగరానికి వచ్చిన సరకు ఇతర ప్రాంతాలకూ సరఫరా అవుతోంది. హోల్‌సేల్ డీలర్ల నుంచి రిటైల్ వ్యాపారులు కొని విక్రయిస్తున్నారు. ఉల్లి ధరల్లో తరచూ హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. ఎప్పుడు పెరుగుతుందో, ఎప్పుడు తగ్గుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందని వ్యాపారులు చెబుతున్నారు.

**సామాన్యులకు ఇక్కట్లు..**

వెల్లుల్లి ధరలు భగ్గుమంటున్నాయి. గతేడాది నుంచి రకాలను బట్టి దీని ధర కిలో రూ.350 నుంచి రూ.400 వరకు పలుకుతోంది. నెల క్రితం ఏకంగా రూ.500కుపైగా చేరటంతో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనలేకపోయారు. గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాల్లో దీని ధర మరింత ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం కిలో రూ.350 నుంచి రూ.400 వరకు పలుకుతోంది. వెల్లుల్లి కోసం మధ్యప్రదేశ్‌పైనే ఆధారపడుతున్నాం. ప్రస్తుతం పాత సరకే వస్తోంది. వచ్చే నెలలో కొత్త సరకు వచ్చే అవకాశముంది. దీనివల్ల కొంతవరకు ధరలు తగ్గొచ్చునని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో చాలామంది రైతులకు ఇప్పుడు శీతల గిడ్డంగుల్లో పంట నిల్వ చేసుకునే అవకాశముంది. అందుకే డిమాండ్ ఉన్నప్పుడు మాత్రమే అమ్ముకుంటున్నారు. దీనికి తోడు దిగుబడి తగ్గటం, మాంసాహారం తినేవారి సంఖ్య అధికమవటం, వివాహాలు, ఇతర శుభకార్యాల సమయాల్లో వండే కూరల్లో వెల్లుల్లి వినియోగం ఎక్కువగా ఉండటం వంటి కారణాలతో ధర పెరుగుతోందని సమాచారం.

# స్మార్టుగా దోపిడీ..!

నల్గొండ : నార్కట్‌పల్లి మండలానికి చెందిన ఓ జంట వ్యక్తిగత వీడియోలను చరవాణిలో నిక్షిప్తం చేసుకొన్నారు. వీటిని సేకరించిన దుండగులు రూ.5 లక్షలు ఇవ్వాలని, లేదంటే వీడియోలు యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. ముందుగా కొంత నగదు ఇచ్చినా.. వేధింపులు ఆగకపోవడంతో సైబర్ పోలీసులను ఆశ్రయించారు.

మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన ఓ యువకుడి చరవాణికి వాట్సప్ కాల్ వచ్చింది. ఓ యువతి ఒంటిపై దుస్తులు లేకుండా మాట్లాడటం చూసి అతను అవాక్కయ్యాడు. కొంతసేపటి తర్వాత అతని చరవాణికి ఇద్దరూ కలిసి ఉన్నట్లు వీడియో పంపి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల తర్వాత మళ్లీ ఫోన్ చేసి రూ.50 వేలు అడగడంతో సైబర్ పోలీసులను ఆశ్రయించాడు.

కాలానుగుణంగా దొంగల్లో మార్పు వచ్చింది. కంటికి కన్పించకుండా మాయమాటలు చెబుతూ.. బ్యాంకుల ఖాతాల్లో ఉన్న రూ.లక్షలను క్షణాల్లో మాయం చేస్తున్నారు. ఓవైపు రాష్ట్ర, అంతర్రాష్ట్ర దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లను చోరీ చేస్తున్నారు. వీరి బారి నుంచి తప్పించుకునేందుకు బ్యాంకుల్లో, ఇతర పొదుపు సంస్థల్లో దాచుకుంటుండగా.. సైబర్ నేరగాళ్లు వీరికి కుచ్చుటోపి పెడుతున్నారు. పోలీసులు అవగాహన సదస్సుల ఏర్పాటు చేస్తున్నా మోసపోతున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది.



**అవగాహన కల్పిస్తున్నాం - శరత్ చంద్రపవార్, ఎస్పీ**

సైబర్ ఫిర్యాదులపై పరిశీలన చేస్తున్నాం. వీటి కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశాం. కొందరు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. చరవాణికి కేవైసీ, బ్యాంకు రుణాలు, తక్కువ ధరకు లోన్లు, విద్యుత్ బిల్లులు అంటూ లింకులు పంపిస్తుంటారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ యాప్‌లో చేరాలని చెప్పే మాటలు నమ్మొద్దు. గుర్తు తెలియని నంబర్ నుంచి వచ్చే వాట్సప్ కాల్స్‌కు స్పందించకూడదు. కెమెరాను పైవేలుతో మూసి ఫోన్ లిఫ్ట్ చేయాలి. మోసానికి గురైన వారు 1930, 155260 టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలి.

# గుప్పుమంటున్న గంజాయి

బోథ్ : జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని యువతే లక్ష్యంగా అక్రమార్కులు గంజాయిని సరఫరా చేస్తున్నారు. దీంతోపాటు ఇక్కడి నుంచి వేరే జిల్లాలకు గుట్టుచప్పుడు కాకుండా సరఫరా అవుతోంది. డబ్బు సంపాదనే లక్ష్యంగా అటవీ ప్రాంతంలోని ఖాళీ స్థలాలను గుర్తించి వాటిలో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది 75 గంజాయి కేసులు నమోదవగా దాదాపు రూ.2.31 కోట్ల విలువైన 9.87 క్వింటాళ్ల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో గ్రామీణ యువత పట్టణాలకు ద్విచక్రవాహనాలపై, ఎవరికీ అనుమానం రాకుండా బస్సుల్లో తరలిస్తున్నారు. హైదరాబాద్‌లాంటి నగరాలకు ద్విచక్రవాహనాలపై సరఫరా చేస్తున్నారు. గంజాయికి అలవాటుపడ్డ పలువురు యువకులు కార్లలో గ్రామీణ ప్రాంతాలకు వచ్చి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

**ఇటీవలి ఘటనలు ..**



బోథ్ మండలంలోని సొనాలకు చెందిన ఓ కిరాణ వ్యాపారి తన ఇంట్లో గంజాయిని నిల్వ చేసుకొని ఉంచుకోగా పోలీసులు దాడి నిర్వహిం చారు. ఇంట్లో నిల్వ ఉన్న రెండు కిలోల గంజాయిని పట్టుకున్నారు. బోథ్ మండలం గుట్టపక్కతండాకు చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్‌లాంటి పట్టణాలకు కొంతకాలంగా గంజాయిని సరఫరా చేస్తున్నాడు. ఇటీవల కామారెడ్డి జిల్లాలో గంజాయితో పలువురు పట్టుబడగా చరవాణిలో మండలానికి చెందిన వ్యక్తి వివరాలు బయటపడ్డాయి. దీంతో భిక్కనూరుకు చెందిన పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

బేల మండలానికి చెందిన పలువురు గంజాయిని పండించి వేరే ప్రాంతానికి సరఫరా చేస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి దాదాపు 1.18 కిలోల గంజాయిని పట్టుకున్నారు. 18 గంజాయి మొక్కలను గుర్తించారు.

మావల మండలానికి చెందిన ఓ వ్యక్తి గంజాయిని ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా మెదక్ జిల్లా రామాయంపేట పోలీసులు జాతీయ రహదారిపై తనిఖీ నిర్వహిస్తుండగా పట్టుకున్నారు.

తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వేరే రాష్ట్రం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న దాదాపు రూ.2.25 కోట్ల విలువైన గంజాయిని పట్టుకున్నారు.

అనుమానం వచ్చి..ఇటీవల బోథ్ మండలంలోని పొచ్చర ప్రయాణ ప్రాంగణంలో నేరడిగొండ మండలం రాజులతండాకు చెందిన చందర్‌సింగ్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించటంతో పోలీసులు తనిఖీలు చేశారు. అతడి వద్ద గంజాయి లభించింది. సొనాలలో సైతం దేరా గ్రామానికి చెందిన నారాయణ గంజాయి పొట్లాలను అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని ఇంటి వద్ద పెరటిలోని గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.

**ఉక్కుపాదం మోపుతాం : జీవన్ రెడ్డి, డీఎస్పీ**

జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం. ప్రత్యేక తనిఖీలు నిర్వహించి గంజాయి పండించే వారిని, సరఫరా చేసే వారిని పట్టుకొని కేసులు నమోదు చేస్తాం. గంజాయిని తరలిస్తూ దొరికిన వాహనాలను సీజ్ చేస్తున్నాం. మహారాష్ట్ర నుంచి సరఫరా చేస్తున్న వారిపై సైతం నిఘా పెట్టాం.

ఈ సంవత్సరం నమోదైన గంజాయి కేసులు: 75
పట్టుకున్న గంజాయి : 9.87 క్వింటాళ్లు
దీని విలువ : 2.31 కోట్లు

# ఇదేం చోద్యం.!

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ పట్టణంలో అనేకచోట్ల ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయి. పాత ఆర్టీఓ కార్యాలయం సమీపంలో రహదారి పక్కన, అటవీశాఖ చెక్‌పోస్టు ఎదురుగా, పాత కలెక్టరేట్ భవనం, చిర్రకుంట వెళ్లే మార్గంలో.. పూర్తిగా ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఇవి కాదని డీఆర్‌డీఏ అధికారులు జిల్లా కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బాబాపూర్ వెళ్లే మార్గంలో మహిళా సమాఖ్యకు స్థలం కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. ఈ స్థలంలో రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. మరోవైపు దూరభారం కానుందని మహిళలు వాపోతున్నారు. కబ్జాలకు పాల్పడిన స్థలాలను గతంలో ప్రత్యేక సర్వే చేసి, అధికారులు పట్టణంలో ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో సర్కారు స్థలాలు అని బోర్డులు సైతం ఏర్పాటు చేశారు. స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ.. పట్టణానికి దూరంగా మహిళా సంఘ భవనం కోసం స్థలాన్ని ఎంపిక చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సైతం ఇదే స్థలం ఎంపిక చేసినప్పుడు, మహిళల నుంచి నిరసన వ్యక్తంకాగా రద్దు చేశారు. తాజాగా ఈ స్థలం ఎంపిక చేయడంతో వివాదం మళ్లీ మొదటికి వచ్చింది. పట్టణంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉన్నాయి. ఇవి క్రమంగా అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే పాత ఆర్టీఓ కార్యాలయం పక్కన రహదారిని ఆనుకుని స్థలంలో ఓ వ్యక్తి సిమెంటు స్తంభాలు సైతం పాతారు. ఈ తరుణంలో సర్కారు స్థలాలను ఇతరులకు కట్టబెట్టే యోచనతోనే కాసులు తీసుకుని సంబంధిత అధికారులు బాబాపూర్ వెళ్లే మార్గంలో స్థలం కేటాయించినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మహిళలకు స్థానికంగా అందుబాటులో ఉండే స్థలాన్నే మహిళా సమాఖ్య కోసం ఎంపిక చేయాలనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అటవీ చెక్‌పోస్టు ఎదురుగా బీడీపీపీ భూములు భారీగా కబ్జాలకు గురవుతున్నాయి. ఇటీవలే అధికారులు నామమాత్రంగా కబ్జాలకు గురైన కాలువ మట్టిని తొలగించారు. ఇదే ప్రాంతంలో గతంలో మహిళలు కబ్జాలను తొలగించారు. ఈ స్థలంలోనే భవనం నిర్మించాలని మహిళలు కోరారు.

# చెత్తశుద్ధి.. ఏదీ చిత్తశుద్ధి

భద్రాచలం : దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం మేజరు గ్రామపంచాయతీని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్య చెత్త పోసేందుకు డంపింగ్ యార్డు లేకపోవటమే. సమస్య పరిష్కారానికి కొన్నేళ్లుగా ప్రయత్నాలు సాగుతున్నా దీని ఫలాలు ఇంకా అందకపోవటంతో సుదూర ప్రాంతాల నుంచి రాములవారి దర్శనానికి వచ్చే భక్తులు నొచ్చుకుంటున్నారు. స్థానికులు 'అయ్యో రామా..' అంటూ వాపోతున్నారు. డంపింగ్ యార్డు ఏర్పడితేనే తమ కష్టాలు తీరతాయని చెబుతున్నారు. రాష్ట్ర విభజనకు ముందే భద్రాచలానికి దూరంగా డంపింగ్ యార్డు ఉండాలని భావించి ఎటపాక సమీపంలో చెత్త పోసేందుకు చర్యలు చేపట్టారు. కొంతకాలం ట్రాక్టర్లు, లారీల్లో చెత్తను ఎటపాక తరలించారు. ఇది అరకొరగానే సాగింది. ఇది దూరంగా ఉందనే కారణంతో గోదావరి కరకట్టపై చెత్త కుప్పలు పోసి రాత్రిపూట తగలబెట్టడంతో పొగతో ఈ ప్రాంత వాసులు అల్లాడిపోయేవారు. ఇదే క్రమంలో 2014లో రాష్ట్ర విభజన జరగటంతో ఎటపాక ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో భాగమైంది. అప్పటి నుంచి స్థల సమస్యతో పూర్తి స్థాయిలో చెత్తను కరకట్టపైనే పడేస్తున్నారు. భారీగా చెత్త కుప్పలు పెరిగి వర్షాలకు అవి నదిలో కలిసేవి. ఈ కలుషిత నీటినే దిగువ ప్రాంత వాసులు ఉపయోగించుకోవాల్సిన దుస్థితి. ఇది ఇలాగే కొనసాగితే పారిశుద్ధ్య నిర్వహణలో భద్రాచలం అధికారులంటేనే చిన్న చూపు తలెత్తే ప్రమాదం నెలకొంది.



**పరిష్కారం ఉందిగా..**

భద్రాచలం పట్టణ శివారున ఆదర్శనగర్ కాలనీలో 8 ఎకరాల స్థలాన్ని గుర్తించి ఇందులో డస్ట్ రీసైక్లింగ్ సెంటర్ (డీఆర్‌సీసీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. యార్డులోని షెడ్లు, ట్రాన్స్‌ఫార్మర్ యంత్రాలకు రూ.1.50 కోట్లు కావాలని అంచనా వేశారు. తడి, పొడి చెత్తను శుద్ధి చేసేందుకు అవసరమైన ఆరు యంత్రాలలో ఇంకొక్కటి రావాల్సి ఉంది. దీన్ని ప్రారంభిస్తే కరకట్టపై చెత్తను పోయరు. గోదావరి జలం కాలుష్యం కాకుండా చూడొచ్చు. నేరుగా కొత్త యార్డులోకి చెత్తను తరలిస్తే అక్కడ కాగితాలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్, పాత దుస్తులు, గాజు, ఇనుము వంటి వాటిని యంత్రాల సాయంతో రీ సైక్లింగ్ చేసి విక్రయించవచ్చు. తడి చెత్త నుంచి వచ్చే వ్యర్థాలను కొన్ని సంస్థలు కొనేందుకు సిద్ధంగా ఉన్నాయి. సేంద్రియ ఎరువులతో పాటు ఇటుకలనూ తయారు చేయవచ్చు.

త్వరలోనే ప్రారంభం..శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ ఈఓ పీఓ తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించేందుకు ఐటీడీఏ రాహుల్ ఆదేశాలతో గ్రామపంచాయతీ సిబ్బంది ప్రచారం చేస్తున్నారు. త్వరలోనే యార్డును ప్రారంభిస్తాం. చెత్త శుద్ధిని విజయవంతం చేస్తాం.

**లోపమెక్కడ..?**

నూతన డంపింగ్ యార్డుకు ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక గ్రాంట్లను తెప్పించడం లేదు.

డీఆర్‌సీసీ పనులకు రూ.80 లక్షలు పంచాయతీ వెచ్చించింది. పంచాయతీపై ఆర్థిక భారం పడకుండా చూడాలి.

డంపింగ్ యార్డు ప్రారంభం కాకపోవడానికి ఓ యంత్రం రాకపోవడం ఒక కారణమైతే.. నిధుల లేమి మరో కారణం.

ఇంకా రూ.70లక్షలను పనిచేసిన వారికి, యంత్రాలు ఇచ్చిన వారికి చెల్లించాలి. ఈ డబ్బుల చెల్లింపు అంశంతేలకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి

# కాలుష్యం పరార్.. పెరగనున్న విక్రయం

మంచిర్యాల : గడువు మీరిన వాహనాలతో కాలుష్యం పెరుగుతోంది. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఈ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రాయితీలు ప్రకటించింది. రహదారి ట్యాక్సు, రిజిస్ట్రేషన్ రుసుమును వంద శాతం మాఫీ చేస్తామని ప్రకటించింది. ప్రభుత్వం ప్రకటించిన రాయితీలతో వీటి కొనుగోళ్లు పెరగనున్నాయి.

రోజు రోజుకు పెరుగుతున్న వ్యక్తిగత అవసరాలతో ప్రతి ఇంటిలో రెండు అంతకంటే ఎక్కువగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ రాయితీల ప్రకటనతో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశం ఉంది. ఒకటి కంటే ఎక్కువ వాహనాలు కొనుగోలు చేసేవారు, చిరువ్యాపారులు పెట్రోల్, డీజిల్ ఖర్చుల భారం తగ్గించుకునేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగిస్తున్నారు.కాలం తీరితే తుక్కుకిందే లెక్క

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో నడిచే వాహనాలకు నిర్ణయించిన కాలపరిమితిని ఇక నుంచి పక్కాగా అమలు చేయాలని రవాణా శాఖ పట్టుదలతో ఉంది. జిల్లాలో పాత వాహనాలు తుక్కులోకి చేరే అవకాశముంది. నిర్దేశిత కాలపరిమితి ముగిసిన వాహనాలు రోడ్డుపై నడవకుండా చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లాలో గడువు తీరిన వాహనాలకు ముగింపు పలికి ఎలక్ట్రిక్ వాహనాలను అమలులోకి తెచ్చేలా రవాణాశాఖ వాహన దారుల్లో అవగాహన కల్పించనున్నారు. పెట్రోల్ ఖర్చులు ఆదా: ఎలుక ప్రీతి, మంచిర్యాల.

వ్యాపారంతో పాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటా. కాలుష్యం తగ్గించడంతో పాటు పెట్రోల్ ఖర్చులు ఆదా చేసుకునేందుకు రెండో వాహనంగా ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేశాను. మూడేళ్లుగా వినియోగిస్తున్నాను. దీని ద్వారా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ఎలక్ట్రిక్ వాహనం నడిపినప్పటికీ అసౌకర్యం లేదు.

ఎలక్ట్రిక్ వాహనంపై ఆసక్తితో..మా ఇంట్లో రెండు వాహనాలు ఉన్నప్పటికీ ఎలక్ట్రిక్ వాహనంపై ఉన్న ఆసక్తి కారణంగా వాహనం కొనుగోలు చేశా. చిన్న చిన్న పనులు, మార్కెట్ అవసరాలు, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవసరమైన రీతిలో ఈ–వాహనాన్ని రెండేళ్లుగా వినియోగిస్తున్నాను.

కంకణాల రోజ, మంచిర్యాల.

వివరాలు సేకరిస్తున్నాం..గడువు మీరిన పాతవాహనాల వివరాలు సేకరించే పనులు చేస్తున్నాం. ఇప్పటికే హరితపన్ను వసూలు చేస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ప్రభుత్వం అవగాహన కల్పించాలని సూచించడంతో రాష్ట్ర రాజధానిలో ప్రక్రియను తొలుతగా చేపడుతున్నారు. సంతోష్, జిల్లా రవాణాశాఖ అధికారి, మంచిర్యాల.

# ఆగుతూ.. సాగుతూ..



గంగాధర : ఉమ్మడి జిల్లాకు వరప్రదాయనిగా ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆధారంగా చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాలకు దాదాపు 1.65 లక్షల ఎకరాలకు సాగు నీరందించాలి. కానీ అసంపూర్తి కాలువలతో సగం విస్తీర్ణానికి కూడా అందించలేని పరిస్థితి నెలకొంది. గంగాధర, నారాయణపూర్ జలాశయాల కింద రెండు ప్రధాన కాలువలు, ఉపకాలువలు నిర్మించాలి. కానీ రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి వైపు కుడికాలువ 19 కి.మీ నిర్మించాల్సి ఉండగా, 18 కి.మీ మేరకు కాలువ తవ్వారు. ఇంకా 1200 మీటర్ల మేరకు తవ్వితేగానీ ఎగువ గ్రామాలకు సాగు నీరందించలేని దుస్థితి నెలకొంది. మంగపేట చెరువు నుంచి 850 మీటర్ల మేరకు కుడికాలువ తవ్వాల్సి ఉంది. గంగాధర ప్రధాన కూడలిలో జగిత్యాల రోడ్డు క్రాసింగు 350 మీటర్ల మేరకు భూమి లోపలి నుంచి ప్రత్యేకంగా కాలువ తవ్వాల్సి ఉంది. ఇక్కడ బండరాళ్లు రావడంతో అర్ధాంతరంగా వదిలేశారు. ఇటీవలే పనులు మొదలుపెట్టారు.

ఈ ప్రధాన కాలువ కింద మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి తదితర గ్రామాల నుంచి వేములవాడ వరకు ఉపకాలువలు తవ్వాల్సి ఉండగా భూసేకరణ సమస్య తలనొప్పిగా మారింది. కాలువలు పూర్తికాక ఎగువ గ్రామాల్లోని 27,500 ఎకరాలకు నీరందక రైతులు ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో 210 ఎకరాలకుగాను ఇంకా 147 ఎకరాల భూసేకరణ జరగక కాలువల పనులు పూర్తవడం లేదు. రామడుగు మండలంలో లక్ష్మీపూర్, దత్తోజిపేట, షానగర్, రామడుగు, ఇతర గ్రామాల్లో సాగునీటి సమస్య నెలకొంది. చొప్పదండి మండలం గుమ్లాపూర్, చిట్యాలపల్లి, కాట్నపల్లి, ఇతర గ్రామాల్లోనూ ఏటా నీటి కోసం రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

భూములకు ఇచ్చి.. ఇళ్లకు మరిచి..

మంగపేట గ్రామంలో 86 ఎకరాల వ్యవసాయ భూములతోపాటు 11 ఇళ్లు కోల్పోతున్నట్లు గతంలోనే అధికారులు గుర్తించారు. నష్టపరిహారం ఇవ్వకపోవడంతో కుడికాలువ తవ్వకం పనులను మంగపేటవాసులు పలుమార్లు అడ్డుకున్నారు. ఇటీవల ప్రభుత్వం వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించింది. ఇళ్లకు మాత్రం చెల్లించలేదు. నారాయణపూర్ చెరువు కట్ట కింద ఉన్న 24 ఇళ్లను గుర్తించినా పరిహారం చెల్లించకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

**రాత్రి పూట కాపలా..**

ఎల్లంపల్లి నీటి ఆధారంగా యాసంగిలో పంటలు వేస్తున్న తమకు కాలువలు పూర్తి కాక ఫాజుల్‌నగర్ నుంచి కోరెం, అనంతపల్లి గ్రామాలకు పైపులైన్ వేసుకున్నాం. బావుల్లో నీరు అడుగంటుతుండడంతో కాలువ వద్ద రాత్రిపూట రెండు గ్రామాల రైతులం కాపల ఉండి నీటిని పారించుకుంటున్నాం. పక్క గ్రామ రైతులతో తమకు ఏటా కొట్లాటే. కుడికాలువ, ఉపకాలువ పనులు పూర్తి చేసి నీటిని అందించాలి.రఘుపతిరెడ్డి, అనంతపల్లి రైతు

**వచ్చే ఏడాదిలో పూర్తి చేస్తాం**

నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి పంటకు నీరందించేందుకు ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నా. కొత్త సంవత్సరంలో కుడికాలువ పనులు చేపట్టి పూర్తి చేస్తాం. వచ్చే వానాకాలం నాటికి ప్రధాన కుడికాలువ ద్వారా ఎగువ గ్రామాలకు సాగునీటిని అందిస్తాం. రామడుగు, చొప్పదండి మండలాల్లోని భూములకు తూములు కాలువల ద్వారా సాగునీరు అందించే పనులు శరవేగంగా సాగుతున్నాయి. నారాయణపూర్ జలాశయం ముంపు బాధితులను ఆదుకునేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి సందర్శించి వారికి భరోసా కల్పించాం.మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

# వాణిజ్య భవనాల్లో మాయ



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు పురపాలికల్లో భవన నిర్మాణాల సంఖ్య విపరీతంగా పెరిగింది. నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకుంటుండగా.. వాటిని నిర్మించే సమయంలో ఆమోదం పొందిన ప్రణాళిక పక్కన పెట్టి.. సొంత ప్లాన్ అమలు చేస్తున్నారు. బహుళ అంతస్తులు, జీ1 దాటిన ఇళ్ల నిర్మాణానికి నిర్మాణ స్థలంలో కచ్చితంగా తాకట్టు(మార్టిగేజ్) పది శాతం పురపాలికలకు రిజిస్ట్రేషన్ చేస్తారు. ఏదైతే ప్లాన్ ప్రకారం అనుమతి తీసుకున్నారో దాని ప్రకారమే నిర్మాణం పూర్తి చేసి స్వాధీన ధ్రువీకరణ పత్రం(ఆక్యుపెన్సీ సర్టిఫికెట్) తీసుకోవాలి. నగరంలో రెండేళ్లుగా భారీగా వాణిజ్య భవనాలు నిర్మిస్తుండగా కనీస నిబంధనలు పాటించడం లేదు.

**పర్యవేక్షణ కనుమరుగు**

నగరవ్యాప్తంగా భవన నిర్మాణాల సంఖ్య పెరిగి పోతుండగా నిర్మాణ సమయంలోనే పట్టణ ప్రణాళిక అధికారులు ఆక్రమణలను గుర్తించడంలేదు. ఈ విధులను నిర్వర్తించాల్సి ఉండగా ఇతర పనులు అప్పగిస్తుండటంతో సమస్యలు అలాగే ఉంటున్నాయి. భవనం పూర్తయిన తర్వాత ఎవరైన ఫిర్యాదులు చేస్తే తప్ప స్పందించడంలేదు. కొన్ని సందర్భాల్లో రాజకీయ ఒత్తిళ్లతో ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. హైకోర్టు ఆదేశాలతో ఇటీవలె పలు నిర్మాణాలు కూల్చిన అధికారులు, ముందుగానే ఎందుకు తనిఖీలు చేయడంలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మార్టిగేజ్ విడుదల చేసుకున్న తర్వాత అదనంగా అంతస్తులు నిర్మిస్తున్నారని, ఇది ముమ్మాటికి ఆక్రమణే అవుతుందని సహ చట్టం సామాజిక కార్యకర్త మహ్మద్ అమీర్ తెలిపారు. ఇలాంటి భవనాలు అనేకం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

**'స్వాధీనం' తర్వాతే ఆక్రమణలు**

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విడుదల చేసిన తర్వాత కొందరు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. ప్రధానంగా వాణిజ్య భవనాలలో పార్కింగ్ కోసం వదిలిన స్థలంలో గదులు నిర్మిస్తున్నట్లుగా పట్టణ ప్రణాళిక అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. స్వాధీనత ధ్రువీకరణ పత్రం తీసుకున్న అనంతరం మళ్లీ అధికారులు తనిఖీలు చేయడంలేదు. ఇంకేముంది ఇష్టానుసారంగా నిర్మాణాలు చేసుకోవడంతో వీధులలో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాల ప్రకారం నగర వ్యాప్తంగా 90 భవనాలకు స్వాధీనత ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. ఇందులో స్టిల్ట్‌2 అంతస్తులు 3, స్టిల్ట్‌5లో 58, స్టిల్ట్‌4లో 26, మూడు అంతస్తులు 6 భవనాలు ఉన్నాయి.

**ఉల్లంఘనలే అధికం..**

భవన నిర్మాణ సమయంలో అనుమతులు నివాసితంగా తీసుకొని ఆ తర్వాత పనులు మాత్రం వాణిజ్య అవసరాలకు అనుకూలంగా మారుస్తున్నారు. 30 ఫీట్ల రోడ్డులో భవనానికి చూట్టు ప్లాన్‌లో చూపినట్లుగా సెట్‌బ్యాక్ స్థలాన్ని వదలాలి. నివాసిత ప్రాంతాల్లో ఒకటెండ్రు అంతస్తులు నిర్మించినా వారి వాహనాల కోసం పార్కింగ్ స్థలం వదలడం లేదు. కొందరైతే షెట్టర్లు నిర్మిస్తూ కనీసం రోడ్డుకు స్థలం వదలకపోవడంతో ఆయా ప్రాంతాల్లో రోడ్ల మీద వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో రహదారి విస్తీర్ణం తగ్గిపోతుంది.

ఆసుపత్రులు, హోటళ్లు, వాణిజ్య సంస్థలు ఉన్న ప్రాంతాల్లో వాహనాలు సెల్లార్‌లో పార్కింగ్ కల్పించాల్సి ఉండగా, చాలాచోట్ల కనిపించడం లేదు. కొందరైతే వాటిని ఇతర అవసరాలకు వాడుతున్నారు.

నోటీసులు ఇచ్చి జరిమానా విధిస్తాంభవనం నిర్మించాక ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తీసుకొని.. ఆ తర్వాత మార్పులు చేసి దుకాణాలు, గదులు నిర్మిస్తే కూలుస్తాం. నోటీసులు ఇచ్చి జరిమానా కూడా విధిస్తాం. సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేణు,ఇన్‌ఛార్జి ఏసీపీ, కరీంనగర్ బల్దియా

# అమలుకు నోచని ఈ–పర్మిట్

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లలో ఈ–పర్మిట్ విధానం అమలుకు నోచుకోవడం లేదు. అంతటా అమలు చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసినా.. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ విధానం అమలైతే మార్కెట్లకు ఆదాయం సమకూరడంతోపాటు జీరో కొనుగోళ్లకు బ్రేక్ పడనుంది. ఫలితంగా అన్నదాతలకు మద్దతు ధర దక్కనుంది. కానీ నేటికీ అమలులో ఎలాంటి పురోగతి కనిపించటం లేదు.

**ఉమ్మడి జిల్లాలో 21 మార్కెట్లు**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 21 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఈ మార్కెట్లలో ఎక్కడా ఈ–పర్మిట్ విధానం అమలైన దాఖలాలు కనిపించటం లేదు. ఈ–నామ్ విధానంతో ఆన్‌లైన్‌లో సమాచారం నమోదు చేసి రైతుకు అందిస్తారు. ఆ తర్వాతనే ఆన్‌లైన్ అనుమతి వచ్చి ప్రతి పర్మిట్‌కు ఒక నంబరు జనరేట్ అవుతుంది. ఈ విధానంతో వేరే ప్రాంతాలకు వెళ్లిన సమయంలో సరకు వివరాలు నమోదు చేయడంతోపాటు వ్యాపారులు పంటలు కొన్న తర్వాత 1 శాతం మార్కెట్లకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మార్కెట్లకు ఆదాయం వస్తోంది.

**అక్రమాల నివారణ సాధ్యం**

ఈ–పర్మిట్ విధానంతో అక్రమాలను నివారించవచ్చు. రైతులు పంటలను ఎక్కడికి తరలించారనే సమాచారం వెంటనే తెలిసిపోతుంది. దీనిని అతిక్రమించిన వ్యాపారులకు అధికారులు జరిమానా విధించే వీలుంటుంది. అక్రమ నిల్వలతోపాటు డబ్బు ఎగవేత, ధరలు పెరిగే ఆస్కారం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు ఈ–పర్మిట్ విధానాన్ని అమలు చేయాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు. మా చేతుల్లో లేదు: సంతోష్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట ఈ–పర్మిట్ విధానం మా చేతుల్లో లేదు. రాష్ట్ర మార్కెట్ అధికారులు నిర్ణయం తీసుకొంటే వారి ఆదేశాల మేరకు అమలు చేస్తాం. ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

# కలలోనైనా కలగనలేదు

లోకేశ్వరం : వారంతా ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు కుటుంబం, వ్యవసాయ పనులలో సందడిగా గడిపే సాధారణ కుటుంబీకులు. ఏదైనా అవసరం వస్తే బస్సులో వెళ్లి పనులు చక్కబెట్టుకుని గమ్యస్థానానికి చేరుకున్నవారే తప్ప ఏనాడూ ఎయిర్ బస్సు చూడలేదు. తమలాగా తమ పిల్లలు కష్టపడకూడదనే ఆలోచనతో వారిని ఉన్నత చదువులు చదివించగా వారు కష్టపడి చదువుకుని విదేశాలలో స్థిరపడి తల్లిదండ్రులకు ఫలితం చూపించారు. దీంతో ఎర్రబస్సు ప్రయాణం, నిర్మల్, నిజామాబాద్లో షాపింగ్, ఆసుపత్రులు, మహా అయితే ఎప్పుడో ఒకసారి హైదరాబాద్‌కు వెళ్లే ఆ తల్లిదండ్రులు గాలి మోటారులో ఖండాలు దాటి అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, లండన్ వంటి విదేశాలలో విహారయాత్రలు చేస్తుండటం నమ్మశక్యం కాని విషయం. ఇదే విషయాన్ని వారి వద్ద ప్రస్తావించగా కలలోనైనా కలగనలేదని, పిల్లల కారణంగానే అవన్నీ చూడగలుగుతున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**మొదటిసారి కాస్త భయమేసింది..**

మాది లోకేశ్వరం మండలంలోని కిష్టాపూర్ గ్రామం. మాకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. మేం వ్యవసాయం చేస్తూనే వారిని బాగా చదివించాం. చిన్ననాటి నుంచి మేం పడే కష్టాలు చూసిన మా పిల్లలిద్దరూ బాగా చదువుకున్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. కుమారుడు దిలీప్‌రెడ్డి కోడలు మనస్వినితో కలిసి అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడ్డారు. కూతురు దీపికరెడ్డి, అల్లుడు కృష్ణారెడ్డి లండన్‌లోని షెఫీల్డ్‌లో ఉంటున్నారు. మేం తొలిసారిగా 2020లో అమెరికా బయలుదేరాం. ఆ సమయంలో కరోనా కారణంగా నేరుగా కాకుండా దుబాయ్ మీదుగా వెళ్లవలసి వచ్చింది. దీంతో అక్కడికి చేరుకునే వరకు కాస్త భయమేసింది. మూడు మాసాలు ఉండి స్వదేశానికి వచ్చాం. రెండో సారి లండన్ వెళ్లి అక్కడ మూడు మాసాలు ఉన్నాం. మా పిల్లల కారణంగానే మాకు విదేశాలలో విహారయాత్ర భాగ్యం కలిగింది.

కాటిపెల్లి పుష్ప–కరుణాకర్‌రెడ్డి, కిష్టాపూర్

**సాగు పనులతోనే సరిపోయేది..**

మాది వ్యవసాయ కుటుంబం. మా అమ్మానాన్న ఇద్దరూ వ్యవసాయంపైనే ఆధారపడి జీవించారు. నాకు పెళ్లయ్యాక కూడా నా భార్య రాజవ్వతో కలిసి వ్యవసాయంతోనే కుటుంబాన్ని పోషించుకోగలిగాం. మేం పడే బాధలు పిల్లలకు ఉండకూడదనే ఉద్దేశంతో మా కుమారుడు సృజన్‌రెడ్డిని బాగా చదివించాం. మా కష్టాన్ని కళ్లారా చూసిన అబ్బాయి ఇక్కడ ఇంజినీరింగ్ పూర్తి కాగానే అమెరికా వెళ్లి అక్కడే మంచి ఉద్యోగాన్ని సంపాదించుకని 2013 నుంచి అక్కడే స్థిరపడ్డాడు. వాడికి పెళ్లయ్యాక మా కోడలు నిత్యారెడ్డితో పాటు అక్కడే ఉంటున్నారు. వారిని చూసేందుకు మేం మొదటి సారిగా 2017లో విమానం ఎక్కి అమెరికా వెళ్లాం. తొలిసారి కాస్త బెరుకుగా అనిపించినా అక్కడికి వెళ్లాక మూడు మాసాలు వారితో గడిపాం. ఎల్లప్పుడూ తోట పనులతోనే కాలం వెళ్లదీసే మేము మా పిల్లల కోసం ఇప్పటికి మూడు సార్లు అమెరికా చుట్టొచ్చాం.

సాలాయిగారి రాజవ్వ–మల్లారెడ్డి, గుండంపెల్లి

**ఇక్కడికి రావడం కొత్త అనుభూతినిచ్చింది...**

మాది లోకేశ్వరం మండలం బాగాపూర్ గ్రామం. మాకు ఇద్దరు పిల్లలు. మా కుమార్తె ప్రళయకు 2015లో నిజామాబాద్ జిల్లాకు చెందిన అభిలాష్‌రెడ్డితో వివాహం జరిపించాం. ఆయన 2010నుంచి అమెరికాలోని డల్లాస్‌లో ఉద్యోగరీత్యా స్థిరపడ్డాడు. వివాహం కాగానే మా కూతురు ప్రళయ కూడా అమెరికాకు వెళ్లింది. దేశం కాని దేశం మమ్మల్ని విడిచి వెళ్లగానే కొద్ది రోజులు బాధగా అనిపించింది. వారి పిలుపు మేరకు 2020 ఫిబ్రవరిలో అమెరికా వెళ్లాం. అక్కడికి వెళ్లగానే కరోనా విజృంభించింది. దీంతో కొద్ది రోజులకే స్వదేశానికి వచ్చేశాం. అక్కడికి వెళ్లామే గానీ ఏమీ చూడలేకపోయామని బెంగపడ్డాం. తిరిగి 20204 జూన్‌లో వెళ్లాం. ఇప్పటికి అయిదు నెలలు కావస్తోంది. డల్లాస్ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ చుట్టి వచ్చాం. ఎప్పుడూ పొలేర్లు, వ్యవసాయం అంటూ పొలం చుట్టూ తిరిగే మాకు అమెరికా విహారం అనగానే కొత్త అనుభూతి పొందాం.

# ఉద్యానకేంద్రాల పై ఉదాసీనత..

కాగజ్‌నగర్ : రైతులకు పండ్ల తోటల పెంపకంపై శిక్షణ ఇవ్వడం, మొక్కల ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన ఉద్యాన నర్సరీ, రైతు శిక్షణ కేంద్రాలు నిర్వహణలోపం, నిధులు కేటాయించకపోవడం తదితర కారణాలతో మూతపడే దశకు చేరుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలోని గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూరు పరిధిలోని ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాలోని రాజంపేట్, కాగజ్‌నగర్ మండలంలోని జంబుగ, మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి భీమారంలో ఉద్యాన కేంద్రాలున్నాయి. ఈ ఉద్యాన కేంద్రాల్లో పెంచిన మామిడి మొక్కల విక్రయంతో తోటలకు రూ.లక్షలాది ఆదాయం వచ్చినా... అందులో నుంచి వీటి అభివృద్ధికి నయాపైసా కేటాయించకపోవడంతో అవి మూసివేత దశకు చేరుకున్నాయి. ఈ కేంద్రాలపై ఆధారపడిన స్థానిక కూలీలను తొలగించడంతో నిర్వహణ లేకుండా పోయింది.

ఈ ఏడాది ఆగస్టులో ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా జంబుగ కేంద్రాన్ని సందర్శించి దశల వారీగా ఈ ఉద్యాన కేంద్రాలను అభివృద్ధి చేయడానికి రూ.1.22 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాలేదు. ఆయా కేంద్రాల్లో హైబ్రీడ్, బంగినపల్లి, దసిరి, మామిడి మొక్కలు అంటుకట్టు విధానంలో ఉత్పత్తి జరిగేది. జంబుగలో 25 మంది, రాజంపేట్‌లో 15 మంది కూలీలు పనిచేసేవారు.

**నీటి తడులు అందక.. పూత రాక**గతంలో ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు ఈ కేంద్రాల నుంచే మొక్కలు సరఫరా చేసేవారు. కానీ వీటి నిర్వహణకు పదేళ్లుగా నయాపైసా కేటాయించకపోవడంతో అధ్వానస్థితికి చేరాయి. జంబుగలో ఒకప్పుడు 30 మంది కూలీలు పనిచేస్తుండగా నేడు కాపలాకు సైతం ఎవరూ లేని స్థితి నెలకొంది. మామిడి, సపోట, నిమ్మ తోటలకు నీటితడులు అందక కాతపూత లేకుండానే ఎండిపోతున్నాయి. గత సంవత్సరం కొత్తగా వేసిన జామతోట నిర్వహణ లేక పిచ్చిమొక్కలతో ఆనవాళ్లు కోల్పోతోంది. ఈ విషయంపై ప్రాజెక్టు ఉద్యానశాఖ అధికారి సందీప్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా తోటల అభివృద్ధికి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించామని మంజూరు లభించలేదని తెలిపారు.

**పర్యవేక్షణ లేక..**జంబుగ, రాజంపేట్ తోటలకు కంచె లేక పశువులు ఈ తోటల్లోనే సంచరిస్తుండటంతో మొక్కలు ఎదగడం లేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న జాతీయ ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్) ద్వారా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి(పీఓ) ఖుష్బుగుప్తా గత ఆగస్టులో ఉద్యాన నర్సరీల బలోపేతానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపించినా నిధుల మంజూరు కాలేదు. తోటల నిర్వహణపై విధులు నిర్వహించాల్సిన సబ్ అసిస్టెంట్‌ను కుమురంభీం జిల్లానే కాకుండా బెల్లంపల్లి తదితర వాటికి విధులు కేటాయించారు. దీంతో ఈ తోటలకు మాలీలు, కూలీలు లేక ఉన్న ఒక్క అధికారే అన్ని కేంద్రాలను చూసుకోవడం తలకు మించిన భారంగా మారింది.



# అల్పపీడన ప్రభావంతో బలమైన గాలులు

## అల్పపీడనం ప్రభావం.. గంటకు 65 కి.మీ. వేగంతో గాలులు: విశాఖ వాతావరణ కేంద్రం

విశాఖ: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం.. బలహీనపడి అల్పపీడనంగా మారిందని విశాఖ వాతావరణ శాఖ అధికారిణి సుధావల్లి తెలిపారు. దీని ప్రభావంతో 1.5 కి.మీ. మేర ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు పేర్కొన్నారు. అల్పపీడన ప్రభావంతో తీరం వెంబడి గంటకు 65 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని పోర్టుల వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. వచ్చే 24 గంటలు నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని పేర్కొన్నారు. రానున్న రెండ్రోజులు రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# ఆ ఇద్దరిపై వేటు.. నాగబాబు, పల్లాకు చాన్స్!?



అమరావతి : కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడు నెలలు పూర్తికావస్తోంది. ప్రభుత్వం లక్ష్యాల మేరకు చకచకా పనులు చేసుకుంటూ పోతోంది. ఇదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం తన జట్టు పనితీరుపై ఓ కన్నేసి ఉంచారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరు తప్పు చేసినా, నిర్లక్ష్యంగా ఉన్నా ముఖం మీదే చెప్పేస్తున్నారు. సరిగా పనిచేయకపోతే ప్రత్యామ్నాయం చూసుకుంటానని ప్రమాణ స్వీకారం రోజే హెచ్చరికలు చేశారు. కానీ, కొందరు మంత్రులు సీఎం స్పీడ్ ను అందుకోలేకపోతున్నారు. దీంతో ఇటీవల మంత్రుల పనితీరుపై మార్కులిచ్చిన సీఎం.. కొందరిని పక్కపెట్టే విషయమై సంకేతాలిచ్చారని చెబుతున్నారు. క్యాబినెట్లోకి కొత్తగా ఒకరిద్దరిని తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో సంక్రాంతికి మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రివర్గాన్ని విస్తరించనున్నారని ప్రచారం ఊపందుకుంది. సంక్రాంతి పండగ కానుకగా ఇద్దరికి క్యాబినెట్ బెర్తు ఇస్తామని హామీ ఇచ్చినట్లు టీడీపీ వర్గాల సమాచారం. మంత్రివర్గంలో ప్రస్తుతం ఖాళీ ఉంది. కానీ, ముఖ్యమంత్రి ఇద్దరికి క్యాబినెట్లో తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఎవరిపై వేటు పడుతుందనేది పొలిటికల్ సర్కిల్స్ లో ఉత్కంట రేపుతుంది. ప్రస్తుతం 24 మంది మంత్రుల్లో ఒకరిద్దరి పనితీరుపై ముఖ్యమంత్రి పూర్తిగా అసంతృప్తిగా ఉన్నట్లు చెబుతున్నారు. వీరి స్థానంలో కొత్తవారిని తీసుకుంటారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం టీడీపీలో మంత్రి పదవులపై చాలా మంది ఆశతో ఉన్నారు. కానీ, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు బాహటంగా ప్రకటించారు. నాగబాబు రాజ్యసభ సభ్యత్వం ఆశించారు. కానీ, ఇటీవల జరిగిన మూడు రాజ్యసభ స్థానాల ఉప ఎన్నికల్లో బీజేపీ ఒక స్థానాన్ని తీసుకుంది. దీంతో జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరిక మేరకు నాగబాబును మంత్రిని చేసేందుకు చంద్రబాబు మాటిచ్చారు. అయితే ప్రస్తుతం నాగబాబు అసెంబ్లీ, మండలిలో సభ్యుడిగా లేరు. దీంతో ఆయనను ముందుగా ఎమ్మెల్సీ చేసి ఆ తర్వాత మంత్రిని చేయాలని అనుకున్నారు. మార్చి వరకు మండలికి ఎన్నికలు జరిగే అవకాశం లేనందున సంక్రాంతికే క్యాబినెట్ విస్తరించి నాగబాబును మంత్రి చేయాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీనికి చంద్రబాబు కూడా సానుకూలంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో నాగబాబుతో పాటు మరికొందరికి మంత్రి పదవులివ్వాలనే ప్రతిపాదన టీడీపీ నుంచి వస్తోంది. ప్రస్తుతం టీడీపీలో చాలా మంది సీనియర్లు మంత్రి పదవులను ఆశిస్తున్నారు. ముఖ్యంగా విశాఖ జిల్లా నుంచి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి జ్యోతుల నెహ్రూ, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి పితాని సత్యానారాయణ, ఎన్టీఆర్ జిల్లా నుంచి దేవినేని ఉమా, రాయలసీమ నుంచి పరిటాల సునీత తదితరులు మంత్రి పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మంత్రివర్గంలో తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు చెబుతున్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా మెరుగైన పనితీరు కనబరుస్తున్న పల్లా, రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిచారు. పైగా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయనను మంత్రిగా ప్రోత్సహిస్తే మంచి ఫలితం ఉంటుందని ముఖ్యమంత్రి భావిస్తున్నారట. దీంతో పల్లాకు లైన్ క్లియర్ అయిందని చెబుతున్నారు. కాగా, నాగబాబుతోపాటు పల్లాను మంత్రి చేయాల్సి వస్తే మంత్రివర్గంలో ఒకరిని రాజీనామా చేయాల్సివుంటుంది. ఆ ఒక్కరు ఎవరు? అనేది టెన్షన్ పుట్టిస్తోంది. ప్రస్తుత మంత్రుల్లో కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాశ్, ఎస్.సవితమ్మ వంటివారు తొలిసారి గెలిచి మంత్రులయ్యారు. రాయలసీమకు చెందిన బీసీ మహిళ సవితమ్మ మంచి పనితీరు కనబరుస్తున్నట్లు ముఖ్యమంత్రి సర్వేలో తేలింది. ఇక కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాశ్ పనితీరుపై తొలి నుంచి ముఖ్యమంత్రికి సదాభిప్రాయం లేదంటున్నారు. జిల్లాలో ఇతర నేతలను కలుపుకుని వెళ్లడంలో ఆయన విఫలమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా విజయనగరం జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బ్యూరోకాట్ మాదిరిగా పనిచేస్తున్నారే కానీ, రాజకీయంగా దూసుకుపోవడం లేదని చెబుతున్నారు. ఆయన జిల్లాలో ఇప్పటికీ వైసీపీ నేత బొత్స హవా కొనసాగుతోందని, దీన్ని కొండపల్లి అడ్డుకోలేకపోతున్నారని పార్టీలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. దీంతో సుభాశ్, కొండపల్లి శ్రీనివాస్ బెర్తులకు ఎసరు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. సుభాశ్ స్థానంలో ఆ జిల్లా నుంచి ఎవరికైనా అవకాశం ఇస్తారా? లేక ఇప్పటికే ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అదే జిల్లాకు చెందిన మరో మంత్రి దుర్గేశ్ కు ఆ జిల్లా బాధ్యతలు అప్పగిస్తారా? అనేది చూడాల్సివుంది. కానీ, మంత్రి కొండపల్లిని తప్పిస్తే విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రస్తుతానికి ఒకరిని తప్పించి పల్లాకు చాన్స్ ఇచ్చి కొద్ది రోజుల తర్వాత పూర్తిస్థాయి ప్రక్షాళన చేపట్టి మొత్తం మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరిస్తారని అంటున్నారు. మొత్తానికి సంక్రాంతి బోనంజాగా నాగబాబు, పల్లా శ్రీనివాసరావులకు మంత్రి యోగం పట్టనుందనే టాక్ అమరావతిలో మంచి రీసౌండ్ ఇస్తోంది.



# ప్రియురాలికి వజ్రాల కళ్లజోడు..
# రూ. 21 కోట్లు దోచిన ఓ ఇంటి దొంగ ప్రేమ

ముంబయి: ఆ యువకుడు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఓ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కంప్యూటర్ ఆపరేటర్. నెలకు రూ.13 వేల జీతం. కానీ, పని చేస్తున్న సంస్థ కళ్లుగప్పి అక్షరాలా రూ. 21.6 కోట్లు దోచేశాడు. ఆ డబ్బుతో ఖరీదైన కార్లు, బైక్‌లు కొన్నాడు. అంతేకాకుండా ఖరీదైన ప్రాంతంలో తన ప్రియురాలి కోసం 4బీహెచ్‌కే ఫ్లాట్ కొనుగోలు చేసి గిఫ్ట్‌గా ఇచ్చాడు. ఊహకే అందని ఈ విచిత్ర ఘటన మహారాష్ట్రలో చోటు చేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. హర్షల్ కుమార్ క్షీరసాగర్ అనే 23 ఏళ్ల యువకుడు ఛత్రపతి శంభాజినగర్‌లోని స్పోర్ట్స్ కాప్లెక్స్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. నకిలీ ఈ మెయిల్ ఖాతాను తెరిచి.. సంస్థ బ్యాంక్ అకౌంట్‌లోని డబ్బును కాజేశాడు. జులై 1 నుంచి డిసెంబరు 7 మధ్య కాలంలో సుమారు రూ. 21.6 కోట్ల నగదును మొత్తం 13 బ్యాంక్ అకౌంట్లకు బదిలీ చేశాడు. బ్యాంకు ఖాతాను హ్యాక్ చేసేందుకు హర్షల్ పక్కా ప్రణాళిక ప్రకారం వ్యవహరించాడు. బ్యాంకు అకౌంట్‌కు లింక్ చేసిన ఈ మెయిల్ అడ్రస్‌ను పోలి ఉండేలా.. కేవలం ఒకేఒక్క అక్షరం తేడాతో కొత్త ఈ మెయిల్‌ను క్రియేట్ చేశాడు. ఆ తర్వాత మెయిల్ అడ్రస్‌లో చిన్న పొరపాటు ఉందని, అప్‌డేట్ చేయాలని కోరుతూ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పాత లెటర్ హెడ్‌పై బ్యాంక్‌కు లేఖ రాశాడు. దీంతో అతడు కొత్తగా క్రియేట్ చేసిన ఈ మెయిల్ బ్యాంక్ ఖాతాకు లింక్ అయింది. తనకు అవసరమైన ఓటీపీలు, లావాదేవీలకు సంబంధించిన ఇతర సమాచారం ఆ ఈ మెయిల్ ద్వారా తెలుసుకునేవాడు. ఆ తర్వాత స్పోర్ట్స్ కాంప్లెక్స్ బ్యాంక్ అకౌంట్‌తో ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను యాక్టివేట్ చేసి.. రూ.కోట్ల మొత్తాన్ని ఇతర అకౌంట్లకు బదిలీ చేశాడు. అలా మొత్తం 13 ఖాతాల్లోకి డబ్బులు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. ఆ డబ్బుతో హర్షల్ రూ. 1.2 కోట్ల విలువైన బీఎండబ్ల్యూ కారు, రూ.1.3 కోట్ల విలువ చేసే మరో ఎస్‌యూవీ, రూ. 32 లక్షలతో బీఎండబ్ల్యూ బైక్ కొనుగోలు చేశాడు. తన ప్రేయసికి ఛత్రపతి శంభాజీనగర్ ఎయిర్‌పోర్ట్‌కి సమీపంలో 4 బీహెచ్‌కే ఫ్లాట్‌ను బహుమతిగా ఇచ్చాడు. అంతేకాకుండా ఆమె కోసం వజ్రాలు పొదిగిన కళ్లజోడును కూడా ఆర్డర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. అతడికి సహకరించిన సహోద్యోగి యశోద శెట్టితోపాటు ఆమె భర్తను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఈ వ్యవహారం వెనక మరింత మంది హస్తం ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఏయే ఖాతాలకు బదిలీ అయ్యిందన్న వివరాలను సేకరిస్తున్నారు. ఖరీదైన వాహనాలను సీజ్ చేశారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఆర్థిక లావాదేవీల్లో పెద్దమొత్తంలో తేడా వస్తున్నట్లు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఉన్నత స్థాయి అధికారి గుర్తించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.




## సీఎం పదవినే వద్దనుకున్నా.. కారణమదే: సోనూసూద్ ఆసక్తికర వ్యాఖ్యలు

బాలీవుడ్ నటుడు సోనూసూద్ కీలక విషయాలు వెల్లడించారు. రాజకీయాల్లో ఉన్నత పదవులు చేపట్టే అవకాశాలు వచ్చినట్లు తెలిపారు. అయితే.. వాటిని తానే తిరస్కరించినట్లు పేర్కొన్నారు. వాటిలో ముఖ్యమంత్రి పదవి కూడా ఉన్నట్లు చెప్పారు. అందుకు కారణాలను కూడా ఆయన వివరించారు. "దేశంలోనే మంచి పేరున్న కొందరు.. సీఎం బాధ్యతలు చేపట్టాలి అంటూ నాకు అవకాశం ఇచ్చారు. కానీ, నేను దాన్ని తిరస్కరించా. దీంతో డిప్యూటీ సీఎం, రాజ్యసభ ఆఫర్లు కూడా ముందుంచారు. రాజకీయాల్లో ఉంటే దేని కోసం మనం పోరాడాల్సిన అవసరం లేదని చెప్పారు. అయితే.. వారిచ్చిన అవకాశాలను స్వీకరించలేకపోయా" అంటూ ఇటీవల ఓ వెబ్‌సైట్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. "రాజకీయాల్లోకి వస్తే పదవితో పాటు ఇల్లు, ఉన్నత స్థాయి భద్రత, ప్రభుత్వ ముద్రతో ఉన్న లెటర్‌హెడ్, విలాసాలు ఉంటాయని పలువురు నాతో చెప్పారు. డబ్బు సంపాదించడం లేదా అధికారం కోసం చాలా మంది రాజకీయాల్లోకి వస్తుంటారు. వాటి పట్ల నాకు ఆసక్తి లేదు. ప్రజా సేవ చేయడానికే అయితే.. ప్రస్తుతం నేను అదే పని చేస్తున్నాను. ఎవరికైనా స్వయంగానే సాయం చేస్తున్నాను. దాని గురించి ఎవరినీ అడగడం లేదు. ప్రస్తుతం నేను స్వేచ్ఛగా జీవిస్తున్నా. సాయం విషయంలోనూ అలాగే ఉంటున్నా. ఒక వేళ నేను రాజకీయ నాయకుడిగా మారితే.. జవాబుదారితనంతో వ్యవహరించాల్సి ఉంటుంది. అది నన్ను మరింత భయపెడుతుంది" అని సోనూసూద్ పేర్కొన్నారు. "ప్రజాదరణ పొందుతున్న వారు.. జీవితంలో ఎదగడం ప్రారంభిస్తారు. నిజానికి ఎత్తైన ప్రదేశాల్లో ఆక్సిజన్ ఉండదు. మనం ఎత్తుకు ఎదగాలని కోరుకుంటాం. కానీ, అక్కడ ఎంతకాలం ఉంటామనేదే చాలా ముఖ్యం" అని అన్నారు. కొవిడ్ సమయంలో వలస కార్మికులకు సోనూసూద్ చేసిన సేవ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వివిధ సేవా కార్యక్రమాల ద్వారా ఎంతో మందిని ఆదుకుంటున్నారాయన. తాజాగా రాజకీయాల్లో కీలక పదవులను చేపట్టడంపై స్పందించి ఈ విషయాన్ని వెల్లడించారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మహారాష్ట్ర గవర్నర్.. ఎన్నికల గురించి ఏం చెప్పారంటే..





తిరుమల: వేంకటేశ్వరస్వామిని మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, టేబుల్ టెన్నిస్ ప్లేయర్ నైనా జైస్వాల్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, అమర్నాథ్ రెడ్డి దర్శించుకున్నారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికలు ఎటువంటి ఘర్షణలు లేకుండా శాంతియుతంగా, నిజాయితీగా జరగాలని శ్రీవారిని గతంలో కోరుకున్నట్లు గవర్నర్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఆ దేవ దేవుడిని ప్రజలు ఎలా అయినా ప్రార్థించవచ్చని, ఆ స్వేచ్ఛ భగవంతుడు మనందరికీ ఇచ్చారని ఆయన అన్నారు. మహిళలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని, కఠినమైన శిక్షలు అమలు చేస్తేనే నేరాలు చేయాలనుకునే వారి వెన్నులో వణుకు పుడుతుందని ఆయన చెప్పారు. తప్పు ఎవరు చేసినా కఠిన శిక్షలు విధిస్తేనే ఆడవారికి నిజమైన రక్షణ కల్పించిన వాళ్లమవుతామని గవర్నర్ చెప్పుకొచ్చారు. మరోవైపు జనవరి 10 నుంచి 19 వరకూ వైకుంఠద్వార దర్శనాలు జరగనున్నాయి.

ఈ నేపథ్యంలో జనవరి 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహించనున్నారు. ఆ తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు. కోయిల్ ఆళ్వార్ నేపథ్యంలో 7వ తేదీన వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు టీటీడీ ప్రకటించింది. దీంతో 6వ తేదీన ఎలాంటి సిఫారసు లేఖలను తీసుకోమని ఆలయ అధికారులు తెలిపారు.



## పులివెందులలో జగన్ పర్యటన .. కార్యకర్తల మధ్య తోపులాట

పులివెందుల: వైకాపా అధినేత జగన్ కడప జిల్లా పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ జిల్లాల నుంచి పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. తోపులాట జరగడంతో కార్యకర్తలను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఈ ఘటనలో కార్యాలయం కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

# జగన్ ప్రజాదర్బార్ నిర్వహించడం హాస్యాస్పదం: ఎమ్మెల్యే యార్లగడ్డ



విజయవాడ: ముఖ్యమంత్రి చంద్రబాబును ఎదుర్కొనే ధైర్యం లేకనే జగన్ అసెంబ్లీకి రావడం లేదని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్ అన్నారు. విజయవాడ రామవరప్పాడులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ.. జగన్‌పై విమర్శలు గుప్పించారు. పులివెందుల పర్యటనలో భాగంగా జగన్ ప్రజాదర్బార్ నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను జగన్ సొంత నిధులతో పరిష్కరిస్తారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలకు రాకుండానే మైక్ ఇవ్వడం లేదంటూ అసత్యాలు చెబుతున్నారన్నారు. జగన్‌కు మైక్ ఇవ్వరేమోనన్న ఫోబియా పట్టుకుందని ఎద్దేవా చేశారు. శాసనసభకు రాకపోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే అవుతుందన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారన్నారని, 11 మంది శాసనసభ్యులు ఉంటే ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వైకాపాకు ప్రతిపక్ష హోదా ప్రజలే ఇవ్వలేదని యార్లగడ్డ వ్యాఖ్యానించారు.

# ఆప్ వర్సెస్ కాంగ్రెస్.. కూటమి కోటకు బీటలు!



కేంద్రంలో ఇండియా కూటమికి బీటలు వారుతున్నది. ఒక్కో పార్టీ నుంచి మెల్లమెల్లగా కూటమి నుంచి తప్పుకుంటున్నాయి. అంతేకాకుండా.. కూటమికి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ వైఖరిపై పార్టీలు నిరసనగళం వినిపిస్తున్నాయి. సొంత కాంగ్రెస్ పార్టీ నుంచి నేతల నుంచి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం అవుతుండడం ఆందోళన కలిగించే పరిణామం. కేంద్రంలో బీజేపీ అధికారంలో నుంచి దింపడమే లక్ష్యంగా 24 విపక్ష పార్టీలతో ఇండియా కూటమి ఏర్పడింది. కూటమికి రోజురోజుకూ బీటలు వారుతున్నది. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల వేళ ఈ విభేదాలు వెలుగు చూడగా.. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా నిరసన వ్యక్తం అయింది. కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ పట్ల అందులోని పార్టీలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించి పెట్టలేని నాయకుడిని ఎన్ని రోజులని భరిస్తాం అంటూ ఒక్కో పార్టీ నేతల నుంచి వాయిస్ వినిపిస్తోంది. ఇదిలా ఉండగా.. లోక్‌సభ ఎన్నికల సందర్భంలోనే ఆప్ తన స్పష్టమైన వైఖరిని చెప్పింది. అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని, కూటమి తరఫున పోటీ చేయబోమని తెలిపారు. ఒంటరిగానే పోటీచేస్తామని స్పష్టం చేశారు. మరో రెండు నెలల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ క్రమంలో కూటమి, ఆప్ మధ్య దూరం మరింత పెరిగినట్లుగా తెలుస్తోంది. వీరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయని ప్రచారం జరుగుతోంది. అంతేకాదు.. ఇండియా కూటమి నుంచి ఏకంగా కాంగ్రెస్ పార్టీని తొలగించేందుకు కూటమిలోని ఇతర పార్టీలను సంప్రదిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు తెలపడం ఆందోళన కలిగించే పరిణామం. ఆప్‌ను లక్ష్యంగా చేసుకొని అజయ్ మాకెన్‌తోపాటు ఇతర ఢిల్లీ కాంగ్రెస్ నేతలు పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఆప్ పార్టీ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఢిల్లీలో మహిళా సమ్మాన్ యోజనలతోపాటు సంజీవని యోజనను ప్రభుత్వం నోటిఫై చేయలేదని ఢిల్లీ యూత్ కాంగ్రెస్ ఫిర్యాదు చేయడాన్ని సైతం ఆప్ సీరియస్‌గా తీసుకుంది. అలాగే.. ఓటర్లను ఆకర్షించేందుకు ఆప్ తప్పుడు, మోసపూరిత హామీలను ఇస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ తన ఫిర్యాదులో పేర్కొంది. దీనిపైనా ఆప్ సీరియస్ అయింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆప్ ఈ విధమైన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందుకే.. కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని తొలగించేలా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

## శ్రీలీల.. ఎర్ర చీరలో అన్‌స్టాపబుల్ లుక్

టాలీవుడ్‌లో అత్యంత డిమాండ్ ఉన్న యాక్ట్రెస్ శ్రీలీల ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఎన్నో విజయవంతమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, తాజాగా పుష్ప 2లో అల్లు అర్జున్‌తో కలిసి స్పెషల్ సాంగ్‌లో సందడి చేయబోతోందనే వార్త ఇప్పటికే ప్రేక్షకులను ఉత్సాహపరచుతోంది. అలాగే ఆమె క్రిస్మస్ సందర్భంగా విడుదలకు సిద్ధమైన రాబిన్‌హుడ్ చిత్రంలో కూడా నటిస్తోంది. ఇంత బిజీ షెడ్యూల్ మధ్య, శ్రీలీల "ఆహా" ప్రఖ్యాత టాక్‌షో అన్‌స్టాపబుల్ విత్ ఎన్బీకేకు హాజరై అభిమానులకు ప్రత్యేక ట్రీట్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ ఎపిసోడ్‌లో ఆమెతో పాటు నవీన్ పోలిశెట్టి కూడా పాల్గొంటున్నారు. ప్రస్తుతం ఈ ఎపిసోడ్ షూటింగ్ జరుగుతోంది. అయితే, షూటింగ్ సెట్స్‌పైనే శ్రీలీల తన గ్లామర్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె ఎర్ర చీరలో చోకర్, పొడవాటి చెవిపోగులు, బ్రేస్‌లెట్స్‌తో అలంకరించుకొని,



సంప్రదాయ గ్లామర్‌ను మిళితం చేస్తూ స్టైలిష్ లుక్‌లో మెరిసింది. ఈ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ టాక్‌షోకు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న నందమూరి బాలకృష్ణతో శ్రీలీల ఇటీవల భగవంత్ కేసరి చిత్రంలో స్క్రీన్ షేర్ చేసుకున్న విషయం తెలిసిందే. ఇక ఆ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి అమ్మడికి మరింత బూస్ట్ ఇచ్చింది. తాజాగా ఈ సినిమా అంశాలు తలపతి విజయ్ 69వ ప్రాజెక్టుకు ప్రేరణ కలిగిస్తున్నాయన్న ప్రచారం కూడా సాగుతోంది. ఇక శ్రీలీల కెరీర్ ప్రస్తుతం మంచి ఊపుమీద కొనసాగుతోంది. తన గ్లామర్‌తో పాటు అద్భుతమైన నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటోంది. టాలీవుడ్‌లోనే కాకుండా ఇతర ఇండస్ట్రీల్లో కూడా ఆమెకు అవకాశాలు వస్తున్నాయి. అన్‌స్టాపబుల్ విత్ ఎన్బీకే టాక్‌షో ఎపిసోడ్ విడుదలకు ముందు నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఎపిసోడ్‌ను ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యాన్స్, శ్రీలీల అందం, అభినయంపై మరింత ఫిదా అవుతారని అనుకోవచ్చు. ఇక శ్రీలీల త్వరలో పుష్ప 2లో స్పెషల్ సాంగ్‌తో అభిమానులను ఎంతగానో అలరించబోతోంది. మరి, రాబిన్‌హుడ్‌తో అమ్మడు ఎంతటి గుర్తింపు తెచ్చుకుంటుందో చూడాలి.

## లైంగిక వేధింపులపై ఐశ్వర్యారాయ్ కామెంట్!

బాలీవుడ్ లో కాస్టింగ్ కౌచ్ అంశం నిరంతరం చర్చకొస్తూనే ఉంటుంది. ఏదో ఒక నటి ఈ అంశంపై మాట్లాడు తుంటారు. లైంగిక వేధింపులు అనేవి అన్ని రంగాల్లో ఉన్నా? సినిమా రంగం ఎక్కువగా హైలైట్ అవుతుంద ని..అయితే మిగతా రంగాలతో పోలిస్తే అధికంగా సినిమా రంగంలో ఉంటుందని పలువురు బాలీవుడ్ నటీమణులు అభిప్రాయ పడిన సందర్భాలున్నాయి. తాజాగా అభిషేక్ బచ్చన్ భార్య, నటి ఐశ్వర్యారాయ్ సమాజంలో జరుగుతోన్న లైంగిక హింసను ఖండించారు. 'సమాజంలో చాలా మంది నిత్యం వేధింపులకు గురవుతూనే ఉన్నారు. సమస్య ఎదురైనప్పుడు ఎదుర్కొనేందుకు ధైర్యంగా, సిద్దంగా ఉండాలి. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు నేరుగా వాళ్ల కళ్లలోకే చూడాలి. మన శరీరం మనకు చాలా ముఖ్యమైనది. ఆ విషయంలో ఎలాంటి రాజీ పడకండి. నిన్ను నువ్వు



కాపాడుకునే విషయంలో ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గొద్దు. మీ శక్తిని అలాంటి సమయాల్లో అస్సలు తక్కువగా అంచనా వేయొద్దు' అంటూ చెప్పుకొచ్చింది. ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. ఐశ్వర్యా రాయ్ వ్యాఖ్యలు మహిళల్లో చైతన్యాన్ని, స్ఫూర్తిని, శక్తిని నింపుతున్నాయి అంటూ నెటి జనులు పోస్టులు పెడుతున్నారు. ఓ మహిళ ఎంత ధైర్యంగా ఉండాలి? అన్నది ఐశ్వర్య ఎంతో గొప్పగా చెప్పారంటూ ప్రశంశిస్తున్నారు. అయితే ఐశ్వర్యా రాయ్ స్పందించింది మొత్తం సమాజాన్ని ఉద్దేశించి మాత్రమే. బాలీవుడ్ చిత్ర పరిశ్రమను ఉద్దేశించి ఆమె ఎలాంటి కామెంట్ చేయలేదు. బాలీవుడ్ లో లైంగిక దాడుల గురించి ఇప్పటి వరకూ చాలా మంది స్పందించిన సంగతి తెలిసిందే. కంగనా రనౌత్, విద్యా బాలన్ సహా చాలా మది సీనియర్ భామలు తమ అభిప్రాయాల్ని పంచుకున్నారు. ఇటీవల మలయాళ పరిశ్రమని జస్టిస్ హేమ కమిటీ నివేదిక సంచలనం రేపిన వేళ! ఆ కాక బాలీవుడ్ ని కాస్త కంగారు పెట్టింది.




## ఇద్దరు సీనియర్ల మధ్య చరణ్ జూనియర్!



2025 సంక్రాంతికి ఇద్దరు సీనియర్ హీరోలు ఒక జూనియర్ హీరో మధ్య త్రిముఖ పోరుకు రంగం సిద్దమవుతోన్న సంగతి తెలిసిందే. మూడు రోజులు ముందుగానే సంక్రాతి ఉత్సవం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' తో మొదలు పెడుతున్నాడు. జనవరి 10న ఆ చిత్రం భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. అటుపై రెండు రోజుల గ్యాప్ అనంతరం గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణ నటిస్తోన్న 'డాకు మహారాజు' 12వ తేదీన రిలీజ్ అవుతుంది. మరో రెండు వ్యవధిలో విక్టరీ వెంకటేష్ నటిస్తోన్న 'సంక్రాంతి వస్తున్నాం' రిలీజ్ అవుతుంది. అలా ముగ్గురు హీరోలు ఈ సంక్రాంతిని షేర్ చేసుకున్నారు.

అయితే సీనియర్ హీరోలతో చరణ్ సినిమా రిలీజ్ అవ్వడం అన్నది ఇదే తొలిసారి. ఓసారి ఆ సినిమాలపై అంచనాలు ఎలా ఉన్నాయో చూస్తే... 'గేమ్ ఛేంజర్' భారీపై భారీ అంచనాలున్నాయి. రామ్ చరణ్ పాన్ ఇండియా స్టార్. 1000 కోట్ల క్లబ్ లో చేరిన హీరో. రీజనల్గానూ చరణ్ ఇమేజ్ ఎంతో ప్రత్యేకమైనది. దీంతో ఆర్డర్ లో ఈ సినిమా టాప్ లో కనిపిస్తుంది. అంతే రిస్క్ కూడా ఈ సినిమాపై ఉంది. ఎందుకంటే ఈ సినిమా డైరెక్టర్ శంకర్ కి సరైన సక్సెస్ పడి చాలా కాలమవుతుంది. చివరి సినిమా 'ఇండియన్-2' కూడా భారీ అంచనాల మధ్య రిలీజ్ అయి బోల్తా పడిన చిత్రం. ఆ రకంగా 'గేమ్ ఛేంజర్' పై ఈ రకమైన టెన్షన్ ఉంది. ఇక 'డాకు మహారాజు' పరంగా చూస్తే అంచనాలు భారీగా ఉన్న రెండవ చిత్రం. బాలయ్య వరుస సక్సెస్ లతో దూసుకుపోతున్నారు. ఆ సినిమా దర్శకుడు బాబి సైతం అదే స్పీడ్ లో ఉన్నాడు. గత సినిమా 'వాల్తేరు వీరయ్య' కూడా భారీ సక్సెస్ అయింది. పక్కా కమర్షియల్ చిత్రాల దర్శకుడిగా పేరుంది. దీంతో బాలయ్యకు హిట్ ఇవ్వడం ఖాయంగా ట్రేడ్ భావిస్తోంది. ఇక వెకంటేష్- అనీల్ రావిపూడి 'సక్రాంతి వస్తున్నాం' అన్నది సేఫ్ ప్రాజెక్ట్ గా కనిపిస్తుంది. పక్కా ఫ్యామిలీ ఎంటర్ టైనర్. వెంకీ సహా అనీల్ సినిమాలకు ఫ్యామిలీ ఆడియన్స్ లో మంచి క్రేజ్ ఉంది. డైరెక్టర్ గా అనీల్ కు ఇంత వరకూ వైఫల్యం లేదు. సంక్రాంతి సీజన్లో ఫ్యామిలీ ఎంటర్ టైనర్లు ఫెయిలైన చరిత్ర కూడా లేదు. ఆర్డర్ ప్రకారం థర్డ్ ప్లేస్ లో కనిపిస్తున్నా? ఆ రెండింటిని మించిన సేఫ్ ప్రాజెక్ట్ ఇది. అయితే 'గేమ్ ఛేంజర్', 'సంక్రాంతి వసున్నాం' రెండు చిత్రాలను దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఆయన పక్కా ప్లానింగ్ తో..తన మార్క్ స్ట్రాటజీతోనే మార్కెట్ లోకి వస్తున్నారు. మరి ఈ మూడు చిత్రాల మధ్య పోటీ ఎలా ఉంటుంది? సంక్రాంతి రేసులో ఎవరిది పై చేయి అవుతుందన్నది చూడాలి.

## 2025 సమ్మర్ ని హీటెక్కించేది ఎంతమంది?



ఏడాది ముగింపు డిసెంబర్ ...కొత్త ఏడాది ఆరంభ నెల జనవరి రిలీజ్ తేదీలు లాక్ అయిన సంగతి తెలిసిందే. అటుపై వచ్చేది సమ్మర్. మరి ఈ వేసవికి ఎన్ని సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. ఎంత మంది హీరోలు బాక్సాఫీస్ వద్ద పోటీ పడుతున్నారు అంటే కాంపిటీషన్ గట్టిగానే కనిపిస్తుంది. మార్చి 28న హరిహరవీరమల్లు రిలీజ్ అవుతుంది. అదే రోజున విజయ్ దేవరకొండ 12వ చిత్రం రిలీజ్కి ఫిక్సైంది. ఇదే నెలలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న విశ్వంభర కూడా రేసులో ఉంది. యూత్ స్టార్ నితిన్ తమ్ముడు వస్తే ఫిబ్రవరిలో ఒకవేళ ఆ నెల మిస్ అయితే మార్చికి వచ్చే అవకాశం ఉంది. మిగతా హీరోల్ని పక్కన బెడితే మార్చిలో చిరంజీవి- పవన్ కళ్యాణ్ సినిమాలు రిలీజ్ అయితే చాలు.

ఆ నెలంతా థియేటర్లు దొరికే పరిస్థితి ఉండదు. అటుపై ఏప్రిల్ దూసుకొస్తుంది. ఈనెలలో భారీ పాన్ ఇండియా సినిమాలే రిలీజ్ కు ముస్తాబవుతున్నాయి. ప్రభాస్ నటిస్తోన్న రాజాసాబ్ ఏప్రిల్ 10న రిలీజ్ అవుతుంది. ఈ సినిమా భారీ అంచనాల మధ్య రిలీజ్ అవుతుంది. చాలా కాలం తర్వాత ప్రభాస్ చేస్తోన్న ఓ కమర్షియల్ చిత్రమిది. ఇక ఇదేనెలలో యంగ్ హీరో తేజ సజ్జా నటిస్తోన్న మిరాయ్ రిలీజ్ అవుతుంది. ఏప్రిల్ 18న లాక్ చేసుకుంది. ఇది చరిత్ర ఆధారంగా తీస్తున్న చిత్రమిది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. హిట్ టాక్ వచ్చిందంటే? హనుమాన్ వసూళ్లను సైతం చెరిపేసే సత్తా ఉన్న చిత్రమిది. అలాగే మంచు విష్ణు నటిస్తోన్న కన్నప్ప కూడా ఏప్రిల్ 25న రిలీజ్ అవుతుంది. భారీ కాన్వాస్ పై తెరకెక్కిస్తోన్న చిత్రమిది. మంచు ఫ్యామిలీ వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోన్న చిత్రమిది. ఇదే నెలలో మరో పాన్ ఇండియా సంచ లనం యశ్ నటిస్తోన్న టాక్సిక్ కూడా రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. కేజీఎఫ్ తర్వాత యశ్ నుంచి రిలీజ్ అవుతున్న సినిమా కావడంతో ఆయన అభిమానులు ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తున్నారు. ఇంకా కాంతార చాప్టర్ వన్, హిట్-3 లాంటి సినిమాలు రిలీజ్ రేస్ లో ఉన్నాయి. విశ్వనటుడు కమల్ హాసన్ నటిస్తోన్న థగ్ లైఫ్ కూడా ప్రేక్షకుల ముందుకు వస్తుంది.

## రెండున్నరేళ్ల తర్వాత బుట్టబొమ్మ బరిలోకి!

ముంబై బ్యూటీ పూజాహెగ్డే మళ్లీ సౌత్ లో కంబ్యాక్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఎంత వేగంగా సౌత్ ని వదిలి నార్త్ కి వెళ్లిందో? అంతే వేగంగా మళ్లీ తిరిగొచ్చింది. బాలీవుడ్ లో పరాజయాలు అమ్మడినికి బ్యాక్ టూ పెవిలీయన్ అనిపించాయి. లక్కీగా కోలీవుడ్...టాలీవుడ్ లో అవకాశాలు వచ్చాయి. సాధారణంగా ఇలా వెళ్లిన హీరోయిన్ కి ఛాన్సులు రావు. ఆవిషయంలో అమ్మడు ఎంతో లక్కీ అనే చెప్పాలి. ఇక అమ్మడు తమిళ్ లో రెండున్నరేళ్ల తర్వాత మళ్లీ మ్యాకప్ వేసుకుంది. ప్రస్తుతం దళపతి విజయ్ 69వ చిత్రంలో హీరోయిన్ గా ఎంపికైన సంగతి తెలిసిందే. సినిమా షూటింగ్



కూడా ఇప్పటికే ప్రారంభమైంది. విజయ్ లేని సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. తాజాగా పూజాహెగ్డే కూడా టీమ్ తో జాయిన్ అయింది. నిన్నటి నుంచి టీమ్ తో కలిసి పనిచేస్తుంది. విజయ్ సినిమా తర్వాతే బాలీవుడ్ కి వెళ్లిపోయింది. మళ్లీ అదే విజయ్ సినిమాతో కంబ్యాక్ అవుతోంది. విజయ్ హీరోగా నటించిన %-%బీస్ట్%-% లో అమ్మడు నటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా రిలీజ్ అయి రెండున్నరేళ్లు అవుతుంది. ఆ తర్వాత మళ్లీ కోలీవుడ్ సినిమా చేయలేదు. బాలీవుడ్ లో బిజీగా ఉండటంతో ఇక్కడి సినిమాలపై ఫోకస్ పెట్టలేదు. అలా కోలీవుడ్ కి దూరమైన పూజా మళ్లీ అదే విజయ్ సినిమాతో కంబ్యాక్ అవ్వడం విశేషం. ఈసినిమాలో అవకాశం రావడం పట్ల విజయ్ కూడా కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. బీస్ట్ లో అమ్మడి పెర్ఫార్మెన్స్ నచ్చడంతోనే దర్శకుడు హెచ్. వినోథ్ పూజాహెగ్డే పేరును పరిశీలిం చమని సూచించారు. అందులో నటనతో పాటు, డాన్సుల్లోనూ బాగా చేసింది. దీంతో వినోథ్ కూడా పూజాని ఫైనల్ చేసారు. ఇటీవలే సూర్య 44వ చిత్రానికి కూడా కమిట్ అయింది. ఇటు తెలుగులోనూ పూజాహెగ్డే కొన్ని సినిమాలకు సైన్ చేసిన సంగతి తెలిసిందే. నాగచైతన్య, సాయితేజ్ హీరోలుగా నటిస్తున్న కొత్త చిత్రాల్లో బుట్టబొమ్మనే హీరోయిన్.

## నేపోటిజం సర్కిల్.. మహేష్ బ్యూటీ తెలివైన సమాధానం

ఫిల్మ్ ఇండస్ట్రీలో నేపోటిజంపై తరచుగా చర్చలు జరుగుతూనే ఉంటాయి. బ్యాక్ గ్రౌండ్ లేదని కావాలని తమకు అవకాశాలు ఇవ్వడం లేదని కొందరు ఇంటర్వ్యూలలో చెప్పే విధానం హాట్ టాపిక్ గా మారుతూ ఉంటుంది. అయితే ఎంత బ్యాక్ గ్రౌండ్ తో వచ్చినా కూడా టాలెంట్ అనేది లేకుంటే ఇండస్ట్రీలో ఉండడం కష్టమని మరికొందరు చెబుతున్నారు. ఇక స్టార్ ఫ్యామిలీ నుంచి వస్తేనే అసలు ఇబ్బంది అని, అలా వచ్చే వారిపై ప్రేక్షకులు ఒక రేంజ్ లో అంచనాలు పెట్టుకుంటారు, దాన్ని అందుకోవడం చాలా ఒత్తిడితో కూడుకున్న పని అంటూ ఇంకొందరు చెబుతుంటారు. ఇక గతంలో స్టార్ కిడ్స్ ను ఇండస్ట్రీలకు పరిచయం చేసే ప్రముఖ దర్శకుడు కరణ్ జోహార్ తాను నేపోటిజం తండ్రిని అంటూ సెటైర్ వేసుకున్నాడు. అయితే, ఈ పరిస్థితుల మధ్యలోనూ కొందరు నటీనటులు తమ ప్రతిభతో ఇండస్ట్రీలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటారు. అటువంటి వారిలో కృతి సనన్ ఒకరు. గోవాలో జరిగిన 55వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో పాల్గొన్న కృతి సనన్, నేపోటిజంపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఆమె మాట్లాడుతూ, "నేపోటిజానికి పరిశ్రమ మాత్రమే కారణం కాదు. ప్రేక్షకులు, మీడియా కూడా



ముఖ్యమైన పాత్ర పోషిస్తుంటాయి. స్టార్ కిడ్స్ మీద మీడియా ఎక్కువ ఫోకస్ చేస్తే, ప్రేక్షకులు వారిని చూడటానికి ఆసక్తి చూపుతారు. దాంతో పరిశ్రమ ఆ స్టార్ కిడ్స్‌తో సినిమాలు చేయాలని భావిస్తుంది. ఇది ఒక తెలియని ఊహించని సర్కిల్ లా జరుగుతూ ఉంటుంది," అని తన వివరణ ఇచ్చింది. అయితే, టాలెంట్ అనేది ఎప్పుడూ అవకాశాలను కల్పిస్తుందని, ప్రతిభ లేని వారు ప్రేక్షకులతో సంబంధాన్ని ఏర్పరచుకోలేరని కృతి అభిప్రాయపడింది. "మీరు టాలెంట్‌తో ఉన్నప్పుడు మీకు అవకాశం దొరుకుతుంది. కానీ, ప్రేక్షకులతో మీకేమీ కనెక్ట్ లేకపోతే, నిలబడడం చాలా కష్టమే," అని ఆమె మళ్ళీ తెలివిగా వివరించింది. కృతి కాంట్రవర్సీకి తావివ్వకుండా నెపోటిజమ్ మంచి సమాధానం ఇవ్వడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇక కృతి సనన్ సోదరి నుపూర్ సనోన్ కూడా ఇండస్ట్రీలో హీరోయిన్ గా కొనసాగుతోంది. ఆమె రవితేజ టైగర్ నాగేశ్వరరావు సినిమాలో హీరోయిన్ గా పరిచయమైంది. అలాగే మరో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక కృతి సనోన్ కెరీర్ విషయానికి వస్తే తన సినీ ప్రయాణాన్ని మహేష్ బాబు 1-నేనొక్కడినే చిత్రంతో ప్రారంభించింది. ఆ తర్వాత ఆమె బాలీవుడ్‌లో హీరోపంతితో డెబ్యూ చేసింది. ఈ చిత్రంలో టైగర్ శ్రాఫ్ హీరోగా నటించారు. ప్రస్తుతం బాలీవుడ్ లోనే అమ్మడు మూడు ప్రాజెక్టులని లైన్ లో పెట్టింది.



# సీఎంతో సినీ ప్రముఖుల భేటీ

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు గురువారం ఉదయం భేటీ అయ్యారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో దాదాపు 50 మంది ఈ భేటీలో పాల్గొన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన, బెనిఫిట్ షోలతోపాటు తాజా పరిణామాలపై ఈ భేటీలో చర్చించుకున్నారు.**



# ప్రభుత్వానికి పరిశ్రమకు మధ్య గ్యాప్.. అపోహ

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం అనంతరం ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు మీడియాతో మాట్లాడారు. సీఎంతో చర్చించిన విషయాల గురించి తెలియజేశారు. తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధే ఈ మీటింగ్ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. తెలుగు సినిమా స్థాయిని పెంచేందుకు ముఖ్యమంత్రి తమకు కొన్ని విషయాల్లో దిశా నిర్దేశం చేశారని చెప్పారు. ఇటీవలి కాలంలో పరిశ్రమ, ప్రభుత్వం మధ్య దూరం ఏర్పడిందనే ప్రచారం జరిగిందని, అదంతా కేవలం అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. త్వరలోనే మరోసారి ముఖ్యమంత్రితో భేటీ అవుతామని చెప్పారు. "తెలుగు సినీ పరిశ్రమ పట్ల తనకు ఉన్న విజన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాతో పంచుకున్నారు. తెలుగు సినిమాను ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం, పరిశ్రమ కలిసి పనిచేయాలనే దానిపై ఆయన చర్చించారు. అందుకు అనుగుణంగా మేమంతా కలిసి వర్క్ చేస్తాం. ఇండియన్ సినిమా వాళ్లే కాకుండా హాలీవుడ్ వాళ్లు కూడా హైదరాబాద్‌లో షూటింగ్స్ చేసుకునేలా ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలనే విషయంపై చర్చించారు. దానిపై చిత్రపరిశ్రమ మొత్తం మరోసారి చర్చించుకుని ఎఫ్‌డీసీ ద్వారా ఆయనకు సలహాలు, సూచనలు ఇస్తాం. హైదరాబాద్‌ను సినిమా ఇండస్ట్రీకి ఇంటర్నేషనల్ హబ్‌గా మార్చేందుకు అడుగులు వేస్తాం. డ్రగ్స్ విషయంలో ప్రభుత్వానికి సహకరిస్తాం. ఈ మధ్య జరిగిన కొన్ని అనివార్య సంఘటనల వల్ల పరిశ్రమ, ప్రభుత్వం మధ్య దూరం పెరిగిందనే ప్రచారం జరుగుతోంది. అది అపోహ మాత్రమే. ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నేను బాధ్యతలు తీసుకుని వారం రోజులు అయింది. యూఎస్ వెళ్లి రాగానే ముఖ్యమంత్రిని కలిశాను. ఇండస్ట్రీ అభివృద్ధి మాత్రమే ఇక్కడ విషయం. బెనిఫిట్ షోలు, టికెట్ రేట్లు అనేది చిన్న విషయం. అది ముఖ్యం కాదు. ఇంటర్నేషనల్‌గా తెలుగు చిత్రపరిశ్రమను అభివృద్ధి చేయడం అనేది అజెండా" అని దిల్ రాజు తెలిపారు.

# సినీ పరిశ్రమ సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: సినీ పరిశ్రమలో సమస్యలు, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనిపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఆయన సూచనలు చేశారు. సినీ పరిశ్రమ కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. మంత్రివర్గ ఉపసంఘం సినీ పరిశ్రమకు చెందిన పలు అంశాలపై అధ్యయనం చేయనుంది. రానున్న రోజుల్లో ఇండస్ట్రీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, అదనపు షోల నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలు, టికెట్ రేట్ల పెంపుపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేయనుంది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టనుంది. సినీ పరిశ్రమ కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించిన నేపథ్యంలో ఇండస్ట్రీ ప్రముఖులు తమ సూచనలను ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

## గ్రూప్-1 పరీక్షపై అభ్యర్థుల పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షపై పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్లతో పాటు పలు అంశాలపై అభ్యర్థులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రిజర్వేషన్లు తేలేంతవరకు గ్రూప్-1 ఫలితాలు ప్రకటించవద్దని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు.

ఫలితాలు నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషన్లను కొట్టివేసింది.



# ప్రజల హక్కుల కోసం నిరంతర పోరాటం: సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి



హైదరాబాద్: మార్క్సిజం, లెనినిజం సిద్ధాంతాల పునాదులపై సీపీఐ ఆవిర్భవించిందని సీపీఐ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. పార్టీ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ ప్రజల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటాలు చేస్తోందని చెప్పారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు ఇంకా అమలు కావడం లేదని తెలిపారు. భూములు, కార్మికుల హక్కులు సీపీఐ పోరాటం వల్లే వచ్చాయని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికే ప్రమాదం వచ్చిపడిందని విమర్శించారు.

**మహిళలు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయి: అజీజ్ పాషా...** దేశవ్యాప్తంగా కమ్యూనిస్టులు పండగ చేసుకుంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా అన్నారు. కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించి నేటికీ వందేళ్లు అవుతోందని చెప్పారు. భారతదేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీది ప్రముఖ పాత్ర అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించినట్లు వివరించారు. రాజ్యసభ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ భాజపా కార్యకర్తల్లా తయారయ్యారని విమర్శించారు. దేశంలో మహిళలు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని మండిపడ్డారు. ఏడాది పాటు పార్టీ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తామని.. ముగింపు కార్యక్రమాన్ని ఖమ్మంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు మీరిచ్చే మర్యాద ఇదేనా..?

హైదరాబాద్ : బీఆర్ఎస్ సీనియర్ లీడర్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టుపై పార్టీ సీనియర్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టును ఖండించారు. వేలాది మంది దళిత గిరిజన ప్రజలకు కమిషన్ ద్వారా న్యాయం చేసిన వ్యక్తికి మీరిచ్చే మర్యాద ఇదేనా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పోలీసులను ఆర్ఎస్పీ సూటిగా ప్రశ్నించారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మీద పెట్టిన కేసే అక్రమం అనుకుంటే, ఆయనకు తోడుగా రక్షణగా వెళ్లిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై అక్రమ కేసు పెట్టి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం? అని ప్రవీణ్ కుమార్ నిలదీశారు. తెలంగాణ పోలీసులకు నిజంగా చట్టం మీద గౌరవం ఉంటే ముందు కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్య కేసులో రేవంత్ బ్రదర్స్‌ను కనీసం ప్రశ్నించండి.. అరెస్టు సంగతి తర్వాత చూద్దాం అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. గజ్వేల్ కేసులో మైనంపల్లి హనుమంతరావు ని ప్రశ్నించండి. షాద్‌నగర్ కేసులో ఎమ్మెల్యే శంకర్‌పై సుమోటో కేసు పెట్టండి. కొల్లాపూర్‌లో ఎనిమిది నెలల క్రితం జరిగిన శ్రీధర్ రెడ్డి హత్య కేసులో నిందితుల ఆచూకీ కనుక్కోండి. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా మీద కేసు పెట్టండి. మొబిలిటీ వ్యాలీ ఫార్ములా-ఇ రేసు ద్వారా రాష్ట్రానికి వచ్చే కోట్ల రూపాయల ఆదాయానికి గండి కొట్టిన రేవంత్ రెడ్డి మీద కేసు పెట్టండి అని పోలీసులకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు.



# పెండింగ్ చలానాల రాయితీపై క్లారిటీ

హైదరాబాద్: ట్రాఫిక్ పెండింగ్ చలానాలపై ప్రభుత్వం మరోసారి రాయితీ ఇచ్చిందని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించారు. చలానాలపై రాయితీ వార్తలను ట్రాఫిక్ పోలీసులు ఖండించారు. పెండింగ్ ట్రాఫిక్ చలానాలపై ఎలాంటి రాయితీ లేదని వెల్లడించారు. తప్పుడు ప్రచారం నమ్మొద్దని ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ విజ్ఞప్తి చేశారు. అటువంటి విధానం అమల్లోకి వస్తే ముందుగానే ప్రకటిస్తామన్నారు. తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. echallan.tspolice.gov.in వెబ్‌సైట్‌లోని సమాచారాన్ని మాత్రమే నమ్మాలని వాహనదారులకు సూచించారు. ఎవరికైనా అనుమానాలుంటే హెల్ప్‌లైన్ నెంబర్లు 040 27852772, 27852721 కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని విశ్వప్రసాద్ తెలిపారు.







# చెరువులో ఎస్సై మృతదేహం.. వెలికితీసిన రెస్క్యూ బృందాలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లాలో అదృశ్యమైన భిక్కనూరు ఎస్సై సాయికుమార్ మృతదేహం లభ్యమైంది. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో ఆయన మృతదేహాన్ని రెస్క్యూ బృందాలు వెలికితీశాయి. బుధవారం రాత్రి అదే చెరువు నుంచి కానిస్టేబుల్ శ్రుతి, సహకార సంఘం ఆపరేటర్ నిఖిల్ మృతదేహాలను బయటకు తీశారు. ఎస్సై సాయికుమార్‌తో పాటు బీబీపేట ఠాణాలో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రుతి, బీబీపేట సహకార సంఘంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న నిఖిల్ అనే యువకుడు ఒకేసారి అదృశ్యమైన ఘటన కలకలం సృష్టించించిన విషయం తెలిసిందే. అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు ఒడ్డున వారి వస్తువులు కనిపించడంతో పోలీసులు చెరువులో బుధవారం రాత్రి గాలింపు చేపట్టారు. అర్ధరాత్రి సమయానికి శ్రుతి, నిఖిల్ మృతదేహాలు చెరువులో లభ్యమయ్యాయి. జిల్లా ఎస్పీ సింధుశర్మ ఆధ్వర్యంలో పోలీసులు.. ఎస్సై ఆచూకీ కోసం గాలింపు చేపట్టగా గురువారం ఉదయం ఆయన మృతదేహం లభ్యమైంది.

**ఏం జరిగిందంటే..** ఎస్సై సాయికుమార్ సెల్‌ఫోన్ బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి స్విచ్‌ఆఫ్ రావడంతో పోలీసు అధికారులు ఆయన కోసం ఆరా తీయడం ఆరంభించారు. బీబీపేట ఠాణాలో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రుతి బుధవారం ఉదయం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నట్లు స్టేషన్లో చెప్పి బయటికి వచ్చారు. మధ్యాహ్నమైనా కుమార్తె రాకపోవడంతో గాంధారి మండలం గుర్జాల్‌లో ఉంటున్న ఆమె తల్లిదండ్రులు బీబీపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్టేషన్ నుంచి ఎప్పుడో వెళ్లిపోయినట్లు వారు తెలపడంతో ఆందోళన చెందిన శ్రుతి తల్లిదండ్రులు వెంటనే అధికారులను సంప్రదించారు. ఆమె ఫోన్ సిగ్నల్ ఆధారంగా సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఎస్పీ ఆధ్వర్యంలోని పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చెరువు వద్ద కానిస్టేబుల్ శ్రుతి సెల్‌తోపాటు బీబీపేటకు చెందిన నిఖిల్ సెల్ కూడా దొరికింది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్‌కు చెందిన కారు, పాదరక్షలు, నిఖిల్ పాదరక్షలూ కనిపించాయి. అనుమానంతో చెరువులో గాలించడంతో బుధవారం రాత్రి శ్రుతి, నిఖిల్.. గురువారం ఉదయం సాయికుమార్ మృతదేహాలు లభ్యమయ్యాయి.

# భారాస నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



హైదరాబాద్: భారాస నేత ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను మాసబ్‌ట్యాంక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంజారాహిల్స్‌లో నమోదైన కేసులో విచారణకు రావాలని నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసానికి వెళ్లారు. ఈక్రమంలో ఎర్రోళ్ల శ్రీనివాస్ తలుపులు తెరవలేదు. విషయం తెలుసుకొని భారాస కార్యకర్తలు అక్కడికి భారీగా చేరుకున్నారు. పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు. దీంతో ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విధుల అడ్డగింతపై భారాస ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ సహా మరికొంత మందిపై గతంలో కేసు నమోదైంది. కేసు దర్యాప్తు అధికారిగా మాసబ్ ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు

**బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు** ... భారాస నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. పోలీసుల విధులను అడ్డుకున్నారని శ్రీనివాస్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఇప్పటికే నాంపల్లి పోలీసులు ఆయన్ను 3 సార్లు విచారణకు పిలిచారు. విచారణకు రాకపోవడంతో గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. వాదనలు విన్న కోర్టు.. శ్రీనివాస్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 5వేల పూచీకత్తుతో పాటు ఇద్దరు ష్యూరిటీలు సమర్పించాలని, పోలీసుల విచారణకు సహకరించాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. అంతకు ముందు భారాస నేతలు హరీశ్‌రావు, వివేక్, ఎర్రబెల్లి దయాకర్‌రావు మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్‌లో ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కలిసి పరామర్శించారు. శ్రీనివాస్‌ను కోర్టుకు తరలించే క్రమంలో పోలీసు వాహనాన్ని భారాస విద్యార్థి నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు.

# అమిత్ షా ఇప్పటికైనా తప్పును ఒప్పుకో.. లేదంటే




హైదరాబాద్, డిసెంబర్ 26: జాతిపిత మహాత్మా గాంధీ సౌత్ ఆఫ్రికా నుంచి భారతదేశానికి వచ్చి ఇక్కడ జరుగుతున్న అసమానత్వం, పేదలకు అన్యాయం జరుగుతుందని తెలుసుకున్నారని.. 1924 లో ఏఐసీసీ అధ్యక్షుడు అయ్యారని మాజీ ఎంపీ హనుమంతరావు అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. అహింస పద్ధతిలో స్వాతంత్ర్యం తీసుకురావడంలో కీలక పాత్ర మహాత్మా గాంధీ పోషించారన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో రాజ్యాంగం రాసిన అంబేద్కర్‌ను అవమానిస్తున్నారని మండిపడ్డారు. భారతరత్నకు గౌరవం ఇస్తున్నాం అన్నప్పుడు అమిత్ షా అటువంటి వాఖ్యలు ఎందుకు చేశారని ప్రశ్నించారు. అంబేద్కర్ బలహీన వర్గాల దేవుడన్నారు. అంటరాని తనం నుంచి విముక్తి చేసేందుకు రిజర్వేషన్ ఇచ్చిన దేవుడు అంబేద్కర్ అని చెప్పుకొచ్చారు. ఇతరులు అంబేద్కర్‌ను అవమానిస్తే.. కేసులు పెట్టి జైల్లో వేసేవారన్నారు. కానీ హోం మంత్రి అమిత్ షా మీద చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్ షా ఇప్పటికైనా తప్పు చేశానని ఒప్పుకొని క్షమాపణలు అడగాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద అవమానం తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు. అమిత్ షా క్షమాపణలు చెప్పకపోతే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. అమిత్ షా మీద ఎస్సి, ఎస్టీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. దీని మీద ఆర్ఎస్ఎస్, బీజేపీ మాట్లాడటం లేదన్నారు. సంధ్య థియేటర్ ఘటన గురించి బీజేపీ ఐటీ సెల్‌లో పని చేసే వ్యక్తి చెప్పిన వ్యాఖ్యలపై వీహెచ్ అభ్యంతరం తెలిపారు. హీరో అల్లు అర్జున్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని సదరు వ్యక్తి ఆరోపిస్తున్నాడని తెలిపారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి ది బ్లాక్ మెయిల్ కల్చర్ కాదని స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రభుత్వాలు కూల్చడమే లక్ష్యమని అన్నారు. కుల గణన బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు చేయడం లేదని వీ. హనుమంతరావు ప్రశ్నించారు.

# ఆరు గ్యారెంటీలను అటకెక్కించి.. ఎమర్జెన్సీని ఏడో గ్యారెంటీగా అమలుచేస్తున్న ముఖ్యమంత్రి: కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా పనిచేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టుచేయడం దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో దళిత, బహుజన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ తరఫున ప్రశ్నిస్తున్నందుకే ఎర్రోళ్లపై కక్షగట్టి అక్రమ కేసులతో వేధించాలని చూస్తున్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా తెల్లవారుజామున ఎర్రోళ్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారెంటీలను అటకెక్కించి, ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీని ముఖ్యమంత్రి అమలుచేస్తున్నారు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక.. నిర్బంధం, అణచివేతతో బీఆర్ఎస్ గొంతునొక్కే విఫల యత్నం చేస్తున్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో పూర్తిగా చేతిలెత్తేసి, ప్రధాన ప్రతిపక్షాన్ని ఎలా నియంత్రించాలనే దానిపైనే సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అక్రమంగా అరెస్టుచేసిన ఎర్రోళ్ళ శ్రీనివాస్ ను వెంటనే విడుదల చేయాలి. తప్పుడు కేసులతో రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలని చూసే విష సంస్కృతికి చరమగీతం పాడాలి. బీఆర్ఎస్ పార్టీకి కేసులు కొత్తకాదు, అరెస్టులు అంత కన్నా కాదు.. ఆత్మగౌరవ పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి బెదిరింపు చర్యలకు భయపడే వారెవరూ లేరంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com